www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్ దినపత్రిక

ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 63 శనివారం, జూలై 18, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

- ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబందన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు



**హైదరాబాద్,జూలై 17 :** తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని

మిగతా2లో...




# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

- హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం
- తొలి రైతులను జెండా ఊపి ప్రారంభించిన మోడీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

**న్యూఢిల్లీ,జూలై 17 :** దేశం లోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శుక్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది

మిగతా2లో...



# నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

- సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహణ
- పోలీసుల అనుమతి నిరాకరణతో హైకోర్టు అనుమతి

**హైదరాబాద్,జూలై 17 :** బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం నాడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్

మిగతా2లో...


# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- నగదురహిత వైద్య సేవలకు శ్రీకారం
- ఇచ్చిన హామీ మేరకం పథకం ప్రారంభం




# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

- నాలుగు జిల్లాల్లో చెదురుమొదురుగా నమోదు
- పూణే ల్యాబ్‌కు జన్యుక్రమ విశ్లేషణ నిమిత్తం 5 నమూనాలు
- జులై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా 339 కోవిడ్ కేసుల నమోదు



**అమరావతి,జూలై 17 :** రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు

మిగతా2లో...



# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

- ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- రవీంద్రభారతి వేదికగా మయంత్రి కొండా సురుఖ అందచేత
- దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్న మంత్రి
- వర్షాల కోసం ఆలయాల్లో వరుణయాగం నిర్వహణకు సంకల్పం

**హైదరాబాద్,జూలై 17 :** దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన

మిగతా2లో...

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు




**న్యూఢిల్లీ,జూలై 17 :** న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ

మిగతా2లో...

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

## - రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 17 :** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ ప్రక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ ప్రక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు

మిగతా2లో...

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ధి పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా

# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనాపాటి, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అర్చకుల దేవతారాధన, వేదపండితుల వేద పారాయణం, పరిచారకుల నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలఅని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ∻ాష్ట్రంలో ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. మంత్రి సురేఖని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది.

అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

**● అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ● రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో కేటీఆర్**



**హైదరాబాద్, జూలై 17 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారా యని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూ ర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

**సభకు అడ్డంకులు సృష్టించే అవకాశం** యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందనీ, అలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువజన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శమని కొనియాడారు.ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నాగా ఉంటాయి.పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**హైదరాబాద్,జూలై 17 :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్దిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ–ఆథరైజేషన్ నుంచి కెయిమ్ సెటిల్‌మెంట్ వరకు పక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది. దీని అమలు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

# నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

(మొదటి పేజీ తరువాయి)

స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇచ్చింది. సభ రోజు హైవేను బ్లాక్ చేయొద్దని విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని పేర్కొంది. పోలీసుల సూచనలు పాటించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాష్ట్ర యువతకు అనేక హామీలు ఇచ్చారని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు చెబుతున్నారు. ఆ సమయంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచే వారు యూత్ డిక్లరేషన్ ప్రకటించారని వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వాగ్దానాలను యువతకు ఇచ్చారని అంటున్నారు. నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గులాబీ నేతలు నిర్ణయించారు. అయితే, ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించగా.. తాజాగా వారి సభకు న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలిరావాలని గులాబీ నేతలు పిలుపునిచ్చారు. కాగా, ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని పక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్‌లను అడిగి తీసుకోవాలన్నారు.

# నీటి సంపులో దూకి తల్లీ బిడ్డల ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్ ,జూలై 17 :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

# ఆపద్బాంధవుల సాహసం.

**- డోలీ మోతతో ప్రాణాలు కాపాడిన 108 సిబ్బంది!**



**ములుగు జిల్లా ప్రతినిధి జూలై 17(పీపుల్స్ న్యూస్)**
ములుగు ప్రభుత్వాలు మారుతున్నా మారుమూల గిరిజన ప్రాంతాల సమస్యలు మాత్రం అలాగే కొనసాగుతున్నాయి. కనీస రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లోనూ రోగులను డోలీలపై మోసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో విధినే దైవంగా భావించిన 108 అంబులెన్స్ సిబ్బంది అసాధారణ సాహసం చేసి ఓ యువకుడి ప్రాణాలను కాపాడి మానవత్వాన్ని చాటుకున్నారు.ములుగు జిల్లా ఏటూరునాగారం ఐటిడిఎ పరిధిలోని గుర్రాలబావి గ్రామానికి చెందిన గోత్తికోయ గిరిజన యువకుడు మడకం అయితయ్య (18) గత నాలుగు రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానిక ఆర్ఎంపీ వద్ద చికిత్స తీసుకున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడక, పరిస్థితి విషమించడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు.దీంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ (ఇఎమ్టీ) శివలింగం ప్రసాద్, పైలట్ కోటి హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. అయితే గ్రామానికి వెళ్లే రహదారి లేకపోవడంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.అయినా వెనుకడుగు వేయని 108 సిబ్బంది బురదతో నిండిన కాలిబాటలో నడుచుకుంటూ గ్రామానికి చేరుకుని, గ్రామస్థుల సహాయంతో బాధితుడిని డోలీలో మోసుకుంటూ ప్రధాన రహదారి వరకు తీసుకొచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించగా రక్తంలో చక్కెర స్థాయి ప్రమాదకరంగా పడిపోవడంతో పాటు తీవ్ర జ్వరం ఉన్నట్లు గుర్తించారు.ఈఆర్సీపీ డాక్టర్ మౌనిక సూచనల మేరకు అత్యవసర చికిత్సగా గ్లూకోజ్, అవసరమైన మందులు, ఇంజెక్షన్లు అందించి, వెంటనే ఏటూరునాగారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పరిస్థితిని వైద్యులకు పూర్తిగా వివరించి చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు.కనీస రహదారి సౌకర్యం లేకపోయినా ప్రాణాలను కాపాడాలనే లక్ష్యంతో విధులు నిర్వహించిన 108 అంబులెన్స్ సిబ్బంది సేవలను స్థానికులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు ప్రశంసించారు. ఇలాంటి సేవాభావంతో పనిచేస్తున్న 108 సిబ్బంది నిజమైన ఆపద్బాం దవులని కొనియాడుతూ, మారుమూల గిరిజన గ్రామాలకు తక్షణమే రహదారి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# వ్యక్తి హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 17 (పీపుల్స్ న్యూస్) :**
ఓ హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంచలనాత్మక హత్య కేసు ను శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని గౌరవ ॥ అడిషనల్ డిస్ట్రిక్ట్ ॥ సెషన్స్ జడ్జ్ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. నేరం నిరూపితమవడంతో నిందితుడైన నిసార్ అహ్మద్‌కు గౌరవ న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించడంతో పాటు రూ. 15,000/- జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది.వివరాల ప్రకారం. హైదరాబాద్ మెహదీపట్నం, సంతోష్ నగర్ కాలనీ నివాసి, రియల్ ఎస్టేట్ వ్యాపారి అయిన మహ్మద్ అబ్దుల్ వహీద్ (74) 2017 ఏప్రిల్ 24న మధ్యాహ్నం 12:30 గంటలకు అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఇంగ్లీష్‌లో ఒక లిఖితపూర్వక ఫిర్యాదును అందించారు. ఫిర్యాదుదారునికి హైదరాబాద్ నగరంలో దాదాపు 50 ఫ్లాట్లు ఉన్నాయి.2017 ఏప్రిల్ 19న ఫిర్యాదుదారుడు మొయినాబాద్‌లోని తన ఫామ్‌హౌస్‌లో ఉన్నప్పుడు, రెంటల్ బ్రోకర్ లతీఫుద్దీన్ ఫోన్ చేసి, ఇద్దరు వ్యక్తులు మెహదీపట్నంలో అద్దెకు ఫ్లాట్ కావాలని అడుగుతున్నట్లు తెలిపాడు. దానిపై సంతోష్ నగర్ కాలనీలోని



'సాజిద్ రెసిడెన్సీ' లో ఉన్న ఫ్లాట్ నెం. 105ను నెలకు రూ. 10,000/- అద్దెకు మాట్లాడారు. తమను తమిళనాడు వెల్లూరు జిల్లాకు చెందిన ఇంతియాజ్ (45), బెంగళూరుకు చెందిన నీసార్ అహ్మద్ (35) గా పరిచయం చేసుకున్న ఆ ఇద్దరు లెదర్ వ్యాపారులు, 2017 ఏప్రిల్ 19 న రాత్రి 19:00 గంటలకు ఫ్లాట్‌లోకి దిగారు. అనంతరం 20 న సాయంత్రం నిందితుడు నిసార్ అహ్మద్ ఫ్లాట్‌కు తాళం వేసి పరారయ్యాడు. 24 న అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ ధర్మేంద్ర ఫ్లాట్ నెం. 105 నుండి దుర్వాసన వస్తోందని యజమానికి సమాచారం ఇచ్చాడు. ఫిర్యాదుదారుడు బ్రోకర్ లతీఫుద్దీన్, వాచ్‌మెన్‌తో కలిసి వచ్చి తాళం తెరిచి చూడగా, బాత్రూమ్‌లో కుళ్ళిపోయిన స్థితిలో నీసార్ అహ్మద్ శవం కనిపించింది. మృతుడి నుదుటిపై రాయితో కొట్టిన తీవ్ర గాయాలు ఉన్నాయి, అలాగే మెడకు తాడు చుట్టి ఉంది. వ్యాపార వివాదాల కారణంగానే నిందితుడు నిసార్ అహ్మద్ ఈ దారుణ హత్యకు పాల్పడినట్లు తేలింది. ఆ తర్వాత నిందితుడిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఈ కేసులో పక్కా ఆధారాలతో దర్యాప్తు చేసి, నిందితుడికి శిక్ష పడేలా శ్రమించిన పోలీస్‌ప్రాసిక్యూషన్‌బృందాన్నిఉన్నతాధికారులుఅభినందిం చారు.

# రోడ్డు భద్రతే లక్ష్యంగా పనిచేయాలి

**నూతన ఆర్‌టీఓలకు డైరెక్టర్ అభిలాష్ బిస్త్ పిలుపు**

**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో జూలై 18 (పీపుల్స్ న్యూస్) :**
రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాలంటే టెక్నాలజీ ఆధారిత ఎన్‌ఫోర్స్‌మెంట్, సమర్థవంతమైన అమలు, ప్రజల్లో అవగాహన అనే మూడు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్‌బీవీఆర్ఆర్ తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ పేర్కొన్నారు.తెలంగాణ రవాణా శాఖకు చెందిన ముగ్గురు రీజినల్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ల (ఆర్‌టీఓలు) కోసం అకాడమీలో 2026 మే 18 నుండి 2026 జూలై 17 వరకు నిర్వహించిన రెండు నెలల ఇండక్షన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ముగింపు సందర్భంగా శుక్రవారం అకాడమీ లో నిర్వహించిన వాలెడిక్టరీ లోఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ ట్రాన్స్పోర్ట్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ కమిషనర్ సి. రమేష్ అతిథిగా హాజరయ్యారు. శిక్షణను పూర్తి చేసిన డి. జగదీష్, పి. భూషి రెడ్డి, చై సాయి చరణ్లకు డైరెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు.ఈ సందర్భంగా డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ యూనిఫాం సర్వీస్‌లో ప్రతి నిర్ణయం ప్రజల ప్రాణాలకు, భద్రతకు సంబంధించినదని అన్నారు. అందుకే లా, ప్రొసీజర్, మోటార్ వెహికల్స్ యాక్ట్, రూల్స్పై పూర్తి అవగాహనతో విధులు నిర్వహించాలని సూచించారు.దేశంలో ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొంటూ, రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీస్ శాఖతో పాటు ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ బాధ్యత కూడా అత్యంత కీలకమని తెలిపారు. 90 శాతం ప్రమాదాలు ఉద్దేశపూర్వకంగా జరగవు. అయితే సమర్థవంతమైన చెకింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ, డ్రైవింగ్ లైసెన్సుల మంజూరులో నాణ్యతను పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఎడ్యుకేషన్, ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అనే మూడు స్తంభాలపై దృష్టి సారించి, టెక్నాలజీని వినియోగిస్తూ స్మార్ట్‌గా పనిచేస్తే రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఆమె సూచించారు. అకాడమీలో పొందిన శిక్షణ భవిష్యత్తులో ప్రజలకు మరింత బాధ్యతాయుతమైన, సమర్థవంతమైన సేవలు అందించేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అడిషనల్ కమిషనర్ సి. రమేష్ మాట్లాడుతూ, గతంలో అకాడమీలో 92 మంది ఏఎంవీఐలు, అనంతరం 15 మంది రెండో బ్యాచ్ ఏఎంవీఐలకు అందించిన శిక్షణ ఫీల్డ్‌లో ఎంతో ఉపయోగపడిందని, పోలీస్ శాఖతో సమన్వయంగా సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు దోహదపడిందని తెలిపారు. అదే విధంగా ఈ ముగ్గురు ఆర్‌టీఓలు కూడా ఈ శిక్షణ ద్వారా మోటార్ వెహికల్స్ యాక్ట్, చట్టపరమైన అంశాలు, అమలు విధానాలపై సమగ్ర అవగాహన పొందారని, అకాడమీకి కృతజ్ఞతలు తెలిపారు.శిక్షణ పూర్తి చేసిన ముగ్గురు ఆర్‌టీఓలు మాట్లాడుతూ, ఈ ఇండక్షన్ ట్రైనింగ్ తమలో సేవా దృక్పథం, నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రజా సేవ పట్ల అంకితభావాన్ని మరింత పెంపొందించిందని తెలిపారు. ముఖ్యంగా అవుట్‌డోర్ ట్రైనింగ్, ఫిజికల్ ఫిట్‌నెస్ కార్యక్రమాలు తమలో ఆత్మవిశ్వాసాన్ని పెంచాయని పేర్కొన్నారు.ఈ ముగింపు సమావేశంలో కోర్సు కో ఆర్డినేటర్ వేమా శ్రీనివాసరెడ్డి 2 నెలల శిక్షణ గురించి వివరించారు.ఔట్ డోర్ ఏ డి రాంబాబు రెండు నెలల శిక్షణ విజయవంతం కావటానికి సహాకరించిన అధికారులందరికీ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్లు డా. చేతన, కవిత, వెంకటేశ్వర్లు, శ్రీరామమూర్తి, కె.ఆర్.కె. ప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్లు వేమా శ్రీనివాసరెడ్డి, యార్లగడ్డ రాంబాబు, వేముల శ్రీనివాసరావు, ఆర్‌టీఓ రఘునాథ్ గౌడ్ ఎం వి ఐ శీతల , డీఎస్పీ రామారావు,బి కృష్ణ ఆర్ ఐ రామకృష్ణ, అకాడమీ, ట్రాన్స్‌పోర్ట్ శాఖకు చెందిన అధికారులు పాల్గొన్నారు.








# కలెక్టర్ ఆదేశాలకు విలువేదీ..?

**-మొగుళ్లపల్లి మండలంలో రెవెన్యూ అధికారులు జిల్లా కలెక్టర్ కు ఇచ్చే విలువ ఇదేనా..?**

**మొగుళ్ళ పల్లి ప్రతినిధి జూలై 17( పీపుల్స్ న్యూస్)**
-ఎస్సారెస్పీ, ఆర్ అండ్ బి రోడ్డు కబ్జాకు గురైతే..ఇంక్వైరీ జరపాలని ఆదేశించిన కలెక్టర్
-ఇంక్వైరీ జరిపిన అధికారుల ఆదేశాలను పట్టించుకోని రెవెన్యూ అధికారులు
-కలెక్టర్ ఆదేశాలకు విలువ లేదా..?
-ప్రశ్నించుకుంటున్న జనం
-ఇప్పలపల్లి గ్రామంలో భూకబ్జాదారున్ని కాపాడుతున్న ఆ అజ్ఞాత ఎవరు?
-కొర్కిశాలలో మరో దందా..?
-రైతుల బండ్ల బాటను పట్టా చేసి. రైతుబంధును మంజూరు చేసిన రెవెన్యూ అధికారులు
- ప్రజా ప్రభుత్వ పాలనలో.. భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్లపల్లి మండలంలో జరుగుతున్న ఈ దందా వెనుక ఉన్న ఆ అధికార పార్టీ నాయకుడు ఎవరు..?
-భగ్గు మంటున్న ప్రజానీకం
-చర్యలు తీసుకోకపోతే రోడ్డెక్కి రెవెన్యూ అధికారుల వైఫల్యాలను ఎండగట్టేందుకు సిద్ధమవుతున్న ప్రజలు-ప్రభుత్వప ప్రజాపాలనలో బండ్ల దారికి పట్టా.. రైతుబంధు పథకమా..?
-ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు
-ఈ తతంగంపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకుంటారా.. లేదా?
-మండల ప్రజల ఆక్రోషం

# రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్‌హెచ్‌ఓగా తోట భూపతి బాధ్యతల స్వీకరణ.

**సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో జూలై 17 (పీపుల్స్ న్యూస్)**
సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన భారీ స్థాయి బదిలీల్లో భాగంగా 55 మంది స్టేషన్ హౌస్ ఆఫీసర్ల ను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో రాయదుర్గం పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్‌హెచ్‌ఓగా ఇన్‌స్పెక్టర్ తోట భూపతిని నియమించారు. 2007 బ్యాచ్‌కు చెందిన తోట భూపతి గత కొంతకాలంగా రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తాజా బదిలీల్లో భాగంగా ఆయనకు అదే పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌ఓగా పదోన్నతి పొందారు. శుక్రవారం సాయంత్రం ఆయన నూతన ఎస్‌హెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తోట భూపతి మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి బాధితుడి ఫిర్యాదును చట్టబద్ధంగా పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల సహకారంతో నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే పని చేసిన అనుభవం ఉండటంతో స్థానిక పరిస్థితులపై ఆయనకు మంచి అవగాహన ఉందని, దీంతో ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందుతుందని అధికారులు భావిస్తున్నారు.



# ఉప్పల్ భగాయత్ ఫేజ్-2లో ట్రాఫిక్ కష్టాలు - తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు



**అంబర్‌పేట:** ఉప్పల్ భగాయత్ ఫేజ్-2 ట్రాఫిక్ కష్టాలతో సతమతమవుతోంది. ఓవైపు ఉప్పల్-నార్లపలి ఎలివేటెడ్ కారిడార్ పనులతో వాహనాలు మళ్లింపుతో రద్దీ పెరగ్గా మరోవైపు ప్రధాన రహదారిపై గణేశ్ విగ్రహాల విక్రయాల వల్ల మరిన్ని ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటోంది. ఫలితంగా ఆ ప్రాంత ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పిల్లలు స్కూల్స్‌కు, పెద్దలు ఆఫీస్‌లకు వెళ్లేటప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
లివేటెడ్ కారిడార్ పనులతో : ఉప్పల్ భగాయత్ ఫేజ్-2 ప్రధాన రహదారి గుండా వేలాదిమంది వాహనదారులు ప్రయాణిస్తుంటారు. ఈ రోడ్డు నాగోల్, రామంతపూర్‌కు వెళ్లేందుకు షార్ట్ కట్ కూడా. ఇప్పటికే ఉప్పల్-నారపల్లి ఎలివేటెడ్ కారిడార్ పనుల వల్ల చాలా వాహనాలను ఇటువైపు మళ్లించారు. ఫలితంగా ఈ రహదారిలో మరింతగా వాహనాల రద్దీ పెరిగిపోయింది. దీనికి తోడు ప్రధాన రహదారి వెంబడి భారీ వినాయక విగ్రహాలు విక్రయాలు జరగడం వల్ల భగాయత్ ఫేజ్-2కు మరిన్ని ట్రాఫిక్ కష్టాలు తెచ్చిపెట్టింది.ఏటా వినాయక చవితి సందర్భంగా ప్రధాన రహదారి వెంబడి గణేష్ విగ్రహాల తయారీ, విక్రయాలకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. విగ్రహాలను కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు వాటిని తరలించేందుకు భారీ వాహనాలు తీసుకొచ్చి ఎక్కడపడితే అక్కడే నిలుపుతారు. దీనితోపాటు రోడ్డును ఆక్రమించి చిరు వ్యాపారులు అమ్మకాలు జరుపుతున్నారు. ఫలితంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.“విగ్రహాలు మెయిన్‌రోడ్?ో పెట్టకుండా లూఎలైన్స్‌లో పెట్టుకుంటే బాగుంటుంది. నాగోల్?-రామాంతపూర్-అంబర్?పేట వెళ్లే మెయిన్?రోడ్డు ఇది. ఇక్కడ ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఇలాంటి చోట విగ్రహాలు పెట్టడం వల్ల ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇక్కడ పారిశ్రామిక ప్రాంతం ఉండటం వల్ల పెద్ద ట్రక్స్? కూడా తిరుగుతుంటాయి. ప్రధాన రహదారిపై విగ్రహాలు పెట్టకుండా శిల్పారామం లైన్?లోకి మార్చాలని కోరుతున్నాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా అనుమతులు ఇవ్వాలని అధికారులను కోరుతున్నాం”- స్థానికులుఅలా చేస్తే ట్రాఫిక్ సమస్యలకు చెక్ : గణేశ్ విగ్రహాల విక్రయాలు పూర్తయ్యాక పగిలిన, అమ్ముడుపోని పీవోపీ విగ్రహాలను ప్రధాన రహదారిపైనే, చెత్త కుప్పల వద్దనే వదిలేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటివరకు ఆ వ్యర్థాలను పూర్తిగా తొలగించలేదన్నారు. ఈ విగ్రహాల విక్రయాలను మరోచోటికి తరలిస్తే ట్రాఫిక్‌తోపాటు కాలుష్య సమస్యలు కూడా తీరుతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.“విగ్రహాలు రోడ్?పైనే పెట్టి అమ్మడం వల్ల వచ్చిన వాళ్ల అందరి వాహనాలు రోడ్డుపైన పార్క్? చేయడం వల్ల రహదారి బ్లాక్ అవుతుంది. పిల్లలు స్కూల్?కు వెళ్లాలన్నా, మేము ఆఫీసులకు చేరుకోవాలన్నా చాలా ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. రహదారిపై విగ్రహాల విక్రయాలకు అనుమతి నిరాకరించి ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించాలని కోరుతున్నాం”- స్థానికులుప్రజా ప్రయోజనాలు, వ్యాపార అవసరాలను సమతుల్యం చేసే విధంగా భగాయత్ ఫేజ్-2 ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రధాన రహదారిపై విగ్రహాల విక్రయాలకు అనుమతి నిరాకరించి, ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించాలని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

### నాగోబా దేవస్థానం ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనం

## కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ఇంద్రవెల్లి :** ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలోని గిరిజనుల ఆరాధ్య దైవం నాగోబా దేవాలయాన్ని శుక్రవారం రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కమిషన్ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా మెశ్రం వంశీయులు నాగోబా దేవాలయ చరిత్ర, మెశ్రం వంశీయుల సంప్రదాయాలు,నాగోబా జాతర విశిష్టత, గిరిజనుల ఆచార వ్యవహారాల గురించి వివరించారు. చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ నాగోబా దేవాలయం తెలంగాణ గిరిజనుల ఆధ్యాత్మిక విశ్వాసానికి ప్రతీకగా నిలిచిందన్నారు. నాగోబా జాతర దేశవ్యాప్తంగా గిరిజన సంస్కృతికి ప్రతిబింబమని, గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచే గొప్ప వారసత్వమని పేర్కొన్నారు.గిరిజన సమాజం తమ మూలాలను, సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించుకుంటూ భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.కమిషన్ సభ్యులు ఆలయ పరిసరాలను పరిశీలించి, దేవాలయ విశిష్టత, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ, ఎస్సీ కమిషన్ సభ్యులు, మెశ్రం వంశీయుల పెద్దలు, ఆలయ అర్చకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, గిరిజన నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మాగనూర్ 'ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ'పై ప్రజల ఆగ్రహం



**మాగనూర్:** మండల కేంద్రంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల తీరుపై మాగనూరు, కృష్ణా ఉమ్మడి మండలాల వినియోగదారులు, వివిధ గ్రామాల లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంట గ్యాస్ సిలిండర్ సకాలంలో అందక సామాన్య ప్రజలు ఆందోళన చెందుతుంటే, గ్యాస్ ఏజెన్సీ మాత్రం సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో అమ్ముకుంటూ అక్రమంగా సొమ్ము చేసుకుంటుదని వారు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

సాధారణ వినియోగదారులకు 'స్టాక్ లేదు' అని చెబుతున్న ఏజెన్సీ నిర్వాహకులు, గురువారం రాత్రి గ్యాస్ సిలిండర్లను గుట్టుచప్పుడు కాకుండా మక్తల్, ఇతరులకు అక్రమంగా తరలించి, అధిక ధరలకు అమ్ముకున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.గ్రామాల నుంచి వచ్చే లబ్ధిదారులు గ్యాస్ సిలిండర్ కోసం ఫోన్ చేస్తే ఏజెన్సీ సిబ్బంది, ఆఫీస్ నిర్వాహకులు స్పందించడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆఫీస్‌కు వెళ్లి అడిగితే కళ్లముందే స్టాక్ కనిపిస్తున్నా, లేదంటూ అబద్ధాలు చెబుతూ రోజులు తరబడి

## వరంగల్ నగరంలో భారీ వర్షం



**వరంగల్:** వరంగల్ నగరంలో భారీ వర్షంకురిసింది. భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమ యమయ్యాయి. రోడ్లపై వర్షపు నీరు నిలవ డంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వర్షాల ప్రభావంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదుంవుతుండటంతో అత్యవస రమైతే తప్ప బయటకు రావొద్దని అధికా రులు, పోలీసులు సూచిస్తున్నారు.

## మంత్రి వాకిటి శ్రీహరికి అస్వస్థత

### బంజారాహిల్స్ కేర్ ఆస్పత్రిలో చికిత్స



**హైదరాబాద్:** రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజులుగా తీవ్ర జ్వరం, ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతుండటంతో ఆయన్ను హైదరాబాద్ బంజా రాహిల్స్ లోని కేర్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం మంత్రి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. మరో రెండు రోజులు విశ్రాంతి తీసుకుంటే సరిపో తుందని పేర్కొన్నారు.

## కృష్ణానదిలో ఆగని అక్రమ ఇసుక రవాణా

### కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు చేస్తున్న తహసీల్దార్ ఎస్సై




**మాగనూరు (కృష్ణ) :** నారాయణపేట జిల్లా పరిధిలోని కృష్ణానదిలో రాత్రి వేళ అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందని మండల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పలుమార్లు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో అవి అమలవడం లేదని ఆరోపిస్తున్నారు.రాత్రి వేళల్లో భారీ టిప్పర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం స్పందిం చకపోవడంతో అక్రమ రవాణాకు పరోక్షంగా ప్రోత్సాహం లభిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కృష్ణ ఎస్సై అండ దండలతోనే ఈ ఇసుక అక్రమ రవాణా కొన సాగుతోందని మండల ప్రజలు ఆరోపిస్తు న్నారు. ఈ ఆరోపణలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, నిజానిజాలను వెలికితీయాలని ప్రజలు కోరుతున్నారు.కాగా, ఇసుక అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వం కోట్ల రూపాయల ఆదాయాన్ని నష్టపోతుందని.. నదీ పరివాహక ప్రాంత పర్యావ రణానికి కూడా ఇది తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందని పర్యావ రణవేత్తలు హెచ్చరిస్తున్నారు.

అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని..

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఉద్యోగులు పెన్షనర్లకు గుడ్ న్యూస్

### నగదు రహిత వైద్య సేవల ప్రారంభం




**హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛీజుహ్రా పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, జుఎజు ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు.ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్ధిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. విధానంలో కొనసాగనుంది.

# హాస్టళ్లు, పీజీల్లో మహిళల భద్రతకు భరోసా!

**- ప్రాజెక్ట్ సేఫ్ స్టేకు శ్రీకారం.. హాస్టళ్లు, పీజీల నమోదు ఇక తప్పనిసరి**

**- యాజమాన్యాలతో భేటీ అయిన హైదరాబాద్ సీపీ, జీహెచ్ఎంసీ కమిషనర్**




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 17 (పీపుల్స్ న్యూస్) :** ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం నగరానికి వచ్చే మహిళలు, విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తూ హైదరాబాద్ సిటీ పోలీస్ కీలక అడుగు వేసింది. వారికి మరింత సురక్షితమైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థలతో





కలిసి సంయుక్తంగా ప్రాజెక్ట్ సేఫ్ స్టే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మొదటి దశ కింద రూపొందించిన సురక్ష నివాస్ 1.ా మార్గదర్శకాల బ్రోచర్‌ను బంజారాహిల్స్ లోని టీజీఐసీసీసీ ఆడిటోరియంలో శుక్రవారం హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ సంయుక్తంగా ఆవిష్కరించారు. అనంతరం కమిషనరేట్ పరిధిలోని హాస్టళ్లు, పీజీల నిర్వహణ, మహిళా భద్రతపై ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో వారు పాల్గొని నిర్వాహకులకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని ప్రతి మహిళా హాస్టల్, పీజీ నిర్వాహకులు తమ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. మహిళల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు నూతనంగా అమల్లోకి తెచ్చిన రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ కింద నిర్దేశిత ఫామ్–ఏ ను పూర్తి చేసి స్థానిక పోలీసులకు సమర్పించాలన్నారు. వసతి గృహాల్లో భద్రతా ప్రమాణాలపై తాము నిర్వహించిన సర్వేలో కొన్ని లోపాలు వెలుగు చూశాయని తెలిపారు. మొత్తం 10 ప్రత్యేక బృందాలతో నగర పరిధిలోని 447 మహిళా హాస్టళ్లలో క్షేత్రస్థాయి పరిశీలన జరపగా.. దాదాపు 97.5 శాతం హాస్టళ్లలో సీసీటీవీ కెమెరాలు ఉన్నప్పటికీ, కేవలం 43 శాతం వసతి గృహాలకు మాత్రమే సరైన కాంపౌండ్ వాల్స్ ఉన్నట్లు తేలిందన్నారు. అలాగే అత్యంత కీలకమైన అగ్నిమాపక పరికరాలు కేవలం 38.9 శాతం హాస్టళ్లలోనే అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ విభాగాల్లో తక్షణమే మార్పులు రావాల్సిన అవసరం ఉందని, భద్రతా లోపాలను సవరించడమే లక్ష్యంగా ఈ నూతన విధానాన్ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. ఈ నియమ నిబంధనలు హాస్టల్ యాజమాన్యాలను ఇబ్బంది పెట్టడానికి లేదా అదనపు ఆంక్షలు విధించడానికి ఉద్దేశించినవి కావని, కనీస భద్రతా ప్రమాణాలను నెలకొల్పి మహిళలకు జవాబుదారీతనంతో కూడిన రక్షణ కల్పించడమే పోలీసుల ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. త్వరలోనే హాస్టళ్లలో మహిళా భద్రతకై ఒక ప్రత్యేక మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని, భవిష్యత్తులోనూ పోలీసులు వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్వాహకులకు తగిన మార్గదర్శకత్వం అందిస్తారని వెల్లడించారు.జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ హాస్టళ్ల నిర్వాహకులు చట్టపరమైన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ నివాసితులకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో ఒకటి లేదా రెండు అపార్?సమెంట్‌లను అద్దెకు ఇవ్వడం వ్యక్తిగత అద్దె (టెనెన్సీ) పరిధిలోకి వస్తుందని, కానీ పెద్ద ఎత్తున భవనాలను సమూహంగా తీసుకుని హాస్టల్ రూపంలో నడపడం కచ్చితంగా 'వ్యాపారం' (ట్రేడ్) కిందికే వస్తుందని ఆయన తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో నిర్వాహకులందరూ వెంటనే మున్సిపల్ ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని, దీని ఆధారంగానే అగ్నిమాపక భద్రతతో పాటు మిగిలిన భద్రతా ప్రమాణాల అమలు సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హాస్టళ్లలో భోజనం, వసతి సదుపాయాలు కల్పించే వారు చట్టప్రకారం కచ్చితంగా 'ఎఫ్ఎస్ఎస్ఏఐ' లైసెన్స్ కలిగి ఉండాలని, లేనిపక్షంలో వాటిని అనధికారిక వసతి గృహాలుగానే పరిగణిస్తామని హెచ్చరించారు.పోలీస్ నిబంధనల ప్రకారం హాస్టల్‌కు వచ్చే, వెళ్లే వారి పూర్తి వివరాలతో కూడిన పక్కా రిజిస్ట్రేషన్ల నిర్వహణ తప్పనిసరి అని పేర్కొన్నారు. హాస్టళ్లలో పనిచేసే సేవకులు, క్లీనర్లు, ఇతర సేవా సిబ్బంది అందరికీ కచ్చితంగా సెక్యూరిటీ చెకప్ నిర్వహించాల్సిన బాధ్యత రావాల్సిన అవసరం ఉందని, భద్రతా లోపాలను సవరించడమే యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో కేవలం సీసీటీవీ కెమెరాల సంఖ్య పెంచడం ముఖ్యం కాదని, అవి ఎంత సమర్థంగా పనిచేస్తున్నాయనేదే ప్రధానమని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ఉమ్మడి ప్రాంతాల్లో (కామన్ ఏరియాస్) అమర్చిన కెమెరాలను ఎప్పటికప్పుడు సరిచూసుకుంటూ, అవి నిరంతరాయంగా రికార్డు అయ్యేలా చూసుకోవాలని నిర్వాహకులకు పిలుపునిచ్చారు. హైదరాబాద్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ టి. వెంకన్న మాట్లాడుతూ... హాస్టళ్లలో అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన అత్యవసర రక్షణ చర్యలను వివరించారు. భవనం ఎన్ని అంతస్తులు ఉన్నప్పటికీ అత్యవస...



# అంగన్‌వాడీలకు సీఎం చంద్రబాబు గుడ్ న్యూస్




**అమరావతి:** అంగన్‌వాడీ సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుడ్ న్యూస్ చెప్పారు. వారికి తల్లికి వందనం పథకాన్ని వర్తింపు చేస్తున్నట్లు వెల్లడించారు. టీచర్లు, మినీ టీచర్లు, ఆయాలకు ఈ పథకాన్ని అమలు చేస్తామని ఆయన వివరించారు.

**అంగన్‌వాడీలకు అండగా కూటమి ప్రభుత్వం: మంత్రి సంధ్యారాణి**

అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న ఈ నిర్ణయంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీల చిరకాల కోరిక నెరవేరిందని అన్నారు. అర్బన్, రూరల్ అంగన్‌వాడీ సిబ్బంది అందరికీ ఈ పథకం అమలు అవుతుందని తెలిపారు. అంగన్‌వాడీ సిబ్బందికి మరింత భరోసా కల్పించే నిర్ణయం ఇదని చెప్పారు. అంగన్‌వాడీల సంక్షేమానికి సీఎం ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తారని ఆమె గుర్తు చేశారు. జీతాల పెంపు, గ్రాట్యుటీ తర్వాత 'తల్లికి వందనం' వరం అని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుతో పాటు మంత్రి నారా లోకేశ్‌కు మంత్రి సంధ్యారాణి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల కుటుంబాల తరఫున సీఎం చంద్రబాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తమను తల్లికి వందనం పథకం పరిధిలోకి తీసుకురావాలంటూ అంగన్‌వాడీలు కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి.. ఈ నిర్ణయం తీసుకుంది.

# నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేసిన సీఎం చంద్రబాబు దేవినేని ఉమా



**విజయవాడ:** డాక్టర్ కేఎల్ రావు కలగన్న గంగా కావేరి నదుల అనుసంధానాన్ని స్ఫూర్తిగా తీసుకుని సీఎం చంద్రబాబు నాయుడు గోదావరి కృష్ణ నదుల అనుసంధానాన్ని పట్టిసీమ ద్వారా సాకారం చేశారని మాజీ మంత్రి దేవినేని ఉమా వెల్లడించారు. శుక్రవారం విజయవాడలో ఆయన మాట్లాడుతూ.. గతంలో వైఎస్ జగన్ పట్టిసీమను "వట్టిసీమ" అని విమర్శించారని గుర్తు చేశారు. కానీ ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పంపుల ద్వారా నీటిని ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. పట్టిసీమ నిర్మాణం సమయంలో జగన్ మమ్మల్ని అవమానించారని తెలిపారు. జగన్ పాలనలో అదే పట్టిసీమ దిక్కు అయ్యిందని వ్యంగ్యంగా అన్నారు.

అమరావతి నిర్మాణం, పట్టిసీమ విషయంలో అడ్డంకులు సృష్టించడం వల్ల రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగిందని దేవినేని ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను, కులాలను రెచ్చగొట్టారు.. మా దిష్టి బొమ్మలను దగ్ధం చేశారని అన్నారు. సీఎం చంద్రబాబు అకుంఠిత దీక్షతో మార్చి 2025లో ప్రారంభించి.. సెప్టెంబర్‌లోనే తొలి విడతగా కొంత నీటిని డెల్టాకు మళ్లించారని చెప్పారు. ఆ తర్వాత జగన్ సొంత నియోజకవర్గం పులివెందులకు నీరు అందించి సీఎం చంద్రబాబు చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. రాయలసీమ రతనాల సీమగా మార్చేందుకు అంకురార్పణ చేయడం ద్వారానే పరిశ్రమలు కూడా ఆ ప్రాంతానికి వచ్చాయని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా పట్టిసీమ ద్వారానే డెల్టాకు నీరు అందించడం దేవుడు రాసిన స్క్రిప్టు అని అభివర్ణించారు. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా గోదావరి నీరు అందడం వల్ల చౌడు భూములు కూడా సారవంతంగా మారాయని దేవినేని ఉమా తెలిపారు. దీని వల్ల ఎకరాకు దిగుబడి 50 నుంచి 60 బస్తాలకు పెరిగిందని చెప్పారు. సాగు నీరు సమృద్ధిగా అందడం వల్ల ఎరువుల ఖర్చు తగ్గి, రైతుల ఆదాయం పెరిగిందని వివరించారు. కరువు సమయాల్లో కూడా నీటిని జాగ్రత్తగా మేనేజ్ చేస్తూ చెరువులు నింపడం, నారుమళ్లను కాపాడుకుంటున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు తక్కువ వర్షపాతంతో ఇబ్బంది పడిన రాయలసీమ.. నేడు హార్టికల్చర్ రంగంలో అద్భుతాలు చేస్తోందని వివరించారు. ఉరవకొండ వంటి ప్రాంతాల్లో రైతులు అరటి, చీని (బత్తాయి), కూరగాయలు, పూల సాగు ద్వారా కోటీశ్వరులుగా మారుతున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమా సంతోషం వ్యక్తం చేశారు.

# మంగళగిరి రైల్వేస్టేషన్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన పీఎం మోదీ పాల్గొన్న మంత్రి లోకేశ్




**గుంటూరు జిల్లా :** ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్ మాటాడుతూ.. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో అమరావతిని పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో వేగంగా రాజధాని పనులు జరుగుతున్నాయన్నారు. ఏపీని నంబర్‌వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఆపలేదని మంత్రి వెల్లడించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా ఏపీకి రాలేదన్నారు. పారిశ్రామికవేత్తలు పారిపోయేలా వైసీపీ పాలన సాగిందని విమర్శలు గుప్పించారు. కూటమి పాలనలో ఏపీకి పెద్దఎత్తున పెట్టుబడులు తరలి వస్తున్నాయన్నారు.

ఏపీలో అన్ని ప్రాంతాలకు పరిశ్రమలను తీసుకొస్తున్నామని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# అమరావతిలో రివర్ ఫ్రంట్ టూరిజంపై ప్రభుత్వం ఫోకస్



**అమరావతి:** ఏపీ రాజధాని అమరావతిలో రివర్ ఫ్రంట్ టూరిజం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. అమరావతిలో చేపట్టే టూరిజం ప్రాజెక్టులపై అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏడీసీఎల్) అధికారులతో మంత్రి నారాయణ ఈరోజు(శుక్రవారం) సమీక్ష నిర్వహించారు. అమ్యూజ్‌మెంట్ పార్క్, ఎకో టూరిజం పార్కులను పీపీపీ విధానంలో ఏడీసీఎల్ అభివృద్ధి చేయనుంది. ఈ నేపథ్యంలో అమరావతిలో రోడ్లు, భవనాల నిర్మాణం పూర్తయ్యేసరికి టూరిజం ప్రాజెక్టులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు సూచనలను పరిగణనలోకి తీసుకుని పర్యాటకులను ఆకర్షించేలా ప్రాజెక్టులు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.

ఇప్పటికే టూరిజం ప్రాజెక్టుల కోసం భూములు కేటాయించిన మిగిలిన సంస్థలు కూడా త్వరగా పనులు ప్రారంభించేలా చూడాలని మంత్రి నారాయణ సూచించారు. ఈ సమీక్షకు అమరావతి డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి, అధికారులు హాజరయ్యారు.

# ఏపీ లిక్కర్ రవాణా కేసులో ఈడీ దూకుడు




**అమరావతి:** ఏపీ లిక్కర్ రవాణా కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దూకుడుగా ఉంది. ఈ కేసుకు సంబంధించి ఈడీ విచారణ కొనసాగుతోంది. సిగ్మా సంస్థకు కేటాయించిన కాంట్రాక్టు గడువు ముగిసిన తరువాత కూడా, నిబంధనలు విరుద్ధంగా దీర్ఘకాలికంగా పొడిగించుకుంటూ వెళ్లినట్లు ఈడీ గుర్తించింది. దీని వల్ల ప్రభుత్వ ఖజానాకు భారీ నష్టం జరిగినట్లు ఈడీ అధికారులు గుర్తించారు. మద్యం రవాణా కాంట్రాక్టులు దక్కించుకున్న సిగ్మా సంస్థ, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్ పేరుకు మాత్రమే ఉన్నాయని, వీటి ఆర్థిక లావాదేవీలన్నీ రాజ్ కసి రెడ్డి, వాసుదేవరెడ్డి చేసినట్లు ఈడీ గుర్తించింది. మద్యం కేసు రవాణా చార్జీలు కింద రూ. 196 వసూలు చేసి, వాటి రవాణా ఖర్చును రూ. 35.57 పెంచారని ఈడీ విచారణలో తేలింది.

దీని ద్వారా వైసీపీ నేతలు రూ. 195.33 కోట్లు లబ్ధిపొందారు. ఈ కుట్రకు రాజ్ కసి రెడ్డి రూపకల్పన చేయగా, నాటి బేవరేజస్ కార్పొరేషన్ ఎండీగా పదవిని అడ్డుపెట్టుకొని వాసుదేవ రెడ్డి కుట్ర అమలు చేసినట్లు ఈడీ గుర్తించింది. సిగ్మా, ప్రసాద్ ట్రాన్స్ పోర్ట్ కంపెనీలు రికార్డ్స్‌లో మాత్రమే పేర్లు ఉన్నాయి. వాటి నిర్వహణ, కాంట్రాక్టు బాధ్యతలు నిర్వహించి రాజ్ కసి రెడ్డి, వాసు దేవా రెడ్డి, వైసీపీ నేతలు లబ్ధి పొందినట్లు ఈడీ అధికారులు విచారణలో వెల్లడైంది

# ఏపీలో ఎల్‌నినో ప్రభావంపై సీఎస్ సమీక్ష అధికారులకు కీలక ఆదేశాలు



**అమరావతి:** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ సమీక్ష నిర్వహించారు. ఈరోజు(శుక్రవారం) సచివాలయంలో జరిగిన సమీక్షలో పలు శాఖల అధికారులకు సీఎస్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలూ అప్రమత్తంగా పనిచేసి ప్రాణ, ఆస్తి, పంటల నష్టాన్ని పూర్తిగా నివారించాలన్నారు. హైరిస్క్ రైతు సేవా కేంద్రాలు, మండలాలపై ప్రత్యేక దృష్టి సారించి పరిస్థితులను ప్రతిరోజూ పర్యవేక్షించాలని సూచించారు. రైతులకు నిరంతర సాంకేతిక సలహాలు అందిస్తూ, ప్రత్యామ్నాయ పంటల సాగు, తక్కువ కాలపరిమితి పంటలు, డ్రై సోయింగ్‌ను విస్తృతంగా ప్రోత్సహించాలన్నారు. ప్రత్యామ్నాయ విత్తనాల నిల్వలు ముందుగానే సిద్ధం చేసి, అవసరమైన ప్రాంతాలకు వెంటనే అందుబాటులో ఉంచాలని ఆదేశించారుతేమలేమితో ఆహారానికి పనికిరాని పంటలను పచ్చిమేతగా వినియోగించాలని... పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నిరోధించి పశుగ్రాసంగా ఉపయోగించాలని సీఎస్ సూచించారు. మేత పంటలకు రక్షిత సాగునీరు కల్పించి, పశుగ్రాస కొరత రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. మిగులు జిల్లాల నుంచి కొరత జిల్లాలకు పశుగ్రాస రవాణా వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రతి మండలంలో కనీసం ఒక పశు శిబిరం ఏర్పాటు చేసి..

పశువులకు తాగునీరు, పశుగ్రాసం, వైద్య సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. పశుగ్రాస బ్యాంకులు, మొబైల్ వెటర్నరీ సేవలు, జిల్లా స్థాయి అత్యవసర కార్యాచరణ ప్రణాళికలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని తెలిపారు. అన్ని శాఖలూ సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో చర్యల అమలుపై నిరంతరం సమీక్ష నిర్వహిస్తూ.. రైతులు, పశుపోషకులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సీఎస్ జి.సాయిప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు.

# మోదీ ఆశీస్సులు నిర్మల ఆలోచనలతో పరుగులు పెడుతోన్న ఏపీ పయ్యావుల కేశవ్



**పల్నాడు జిల్లా:** రాజకీయాల కోసం ఈ ప్రాంతంలో వైషమ్యాలు పెంచిన వాళ్లను గతంలో చూశామని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ఒకే రోజున రూ. 3 వేల కోట్లను కూటమి ప్రభుత్వం అందించిందని తెలిపారు. ఈరోజు(శుక్రవారం) నరసరావుపేటలో వివిధ ప్రభుత్వ రంగ బ్యాంకుల క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థను వైసీపీ అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. కూటమి అధికారంలోకి వచ్చాక.. ఏ పని చేయాలన్నా ఖజానాలో డబ్బు లేని పరిస్థితి ఉండేదని అన్నారు. ప్రధాని మోదీ ఆశీస్సులు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఆలోచనలతో ఏపీ ఇప్పుడు అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందన్నారు. ఒక మహిళ ఇంటిని ఎలా తీర్చిదిద్దుతుందో అంతకంటే మెరుగ్గా నిర్మలా సీతారామన్ పని చేస్తున్నారని మంత్రి కొనియాడారు. '2024లో మీరు వేసిన ఒక్క ఓటు వల్లే ఏపీకి అమరావతి, పోలవరం, విశాఖ ఉక్కు, తల్లికి వందనం, ఉచిత బస్సు, గూగుల్ వంటి కంపెనీల రాక సాధ్యమైంది' అని చెప్పుకొచ్చారు. ఏపీకి ఏ కష్టం వచ్చినా నిర్మలా సీతారామన్ ఇంటి తలుపు తట్టి సాయం అడుగుతున్నామని.. రాష్ట్రం కోసం ఏం అడిగినా కాదనకుండా కేంద్ర మంత్రి పని చేస్తున్నారని తెలిపారు. విశాఖలో ఉక్కు పరిశ్రమ పరిరక్షణకు నిర్మలమ్మ చూపిన చొరవకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఎన్డీయే ప్రభుత్వం.. రేయింబవళ్లూ రాష్ట్రం కోసం పని చేస్తోందని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

**మహిళలు, యువతకు భారీగా రుణాలు: శ్రీకృష్ణదేవరాయలు**

ప్రతి గ్రామానికి కేంద్ర పథకాలు చేరాలన్నదే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్ష అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మహిళలు, యువత, వ్యాపారాలకు భారీగా రుణాలు ఇస్తున్నామన్నారు. మొదటిసారిగా ట్రాన్స్‌జెండర్లకు బ్యాంకు రుణాలు అందించామని తెలిపారు. అటవీ సాగుహక్కు పట్టాలు పొందిన గిరిజనులకు కూడా రుణాలు అందిస్తున్నామని చెప్పారు. బ్యాంకుల్లో ఉన్న డ్వాక్రా సంఘాల డిపాజిట్లకు వడ్డీ చెల్లించాలని.. డ్వాక్రా సంఘాల వారితో 25 మండలాల్లో 25 మెగావాట్ల సౌరవిద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుకు సహకరించాలని కేంద్ర మంత్రిని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు.


# ప్రియుడితో కలిసి కుమారుడిపై మహిళ దాడి బ్లేడుతో కోసి చిత్రహింసలు




**చిత్తూరు జిల్లా:** వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడనే కారణంతో ఓ చిన్నారిపై కన్నతల్లే దాడి చేసిన ఘటన చిత్తూరు జిల్లా వి.కోటలో చోటుచేసుకుంది. ఏకాంతంగా గడిపేందుకు ఇబ్బందిగా ఉందని ప్రియుడు చెప్పడంతో కుమారుడిపైనే దారుణానికి ఒడిగట్టింది. వి.కోటకు చెందిన మహిళకు ఏడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఇటీవల ఎర్రచేనుకు చెందిన రాజుతో ఆమెకు వివాహేతర సంబంధం ఏర్పడింది. దీంతో తరచూ అతను వి.కోటకు వచ్చి సదరు మహిళను కలుస్తూ ఉండేవాడు. ఇద్దరూ ఏకాంతంగా గడిపేవారు. ఈ క్రమంలో వారికి బాలుడు అడ్డుగా అనిపించాడు. ఇదే విషయాన్ని ప్రియుడు ఆ మహిళకు చెప్పగా.. చిన్నారిని ఇంటి నుంచి వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. ఇందుకు అతడిని చిత్రహింసలకు గురి చేయడం ప్రారంభించారు. తరచూ విపరీతంగా కొడుతూ పైశాచిక ఆనందం పొందేవారు. చివరికి ఈరోజు (శుక్రవారం) ఇద్దరూ కలిసి చిన్నారిపై ఏకంగా బ్లేడ్‌తో దాడి చేశారు. ఇష్టమొచ్చినట్లు గాయపరిచారు. చివరికి బాలుడి మర్మాంగాలను కూడా బ్లేడ్‌తో కోశారు. దీంతో చిన్నారి తీవ్ర గాయాలతో అల్లాడిపోయాడు. విపరీతంగా అరుస్తూ ఏడవడం మొదలెట్టాడు.

ఇరుగుపొరుగు వారు హుటాహుటిన చిన్నారి వద్దకు వచ్చి చూడగా.. ఒంటినిండా రక్తపు గాయాలతో కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా గ్రామానికి చేరుకున్నారు. వెంటనే బాలుడిని కాపాడి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు పోలీసులు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, వివాహేతర సంబంధం మోజులో కన్న కొడుకునే అత్యంత ఘోరంగా చిత్రహింసలకు గురిచేసిన తల్లిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తల్లి అనే పదానికే మచ్చ తెచ్చిందని, ఆమెపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# తక్కువ నాణ్యత పొగాకుకూ గిట్టుబాటు ధర టొబాకో బోర్డుకు మంత్రి అచ్చెన్న ఆదేశాలు



**అమరావతి:** ఎఫ్‌సీవీ పొగాకు కొనుగోళ్లపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే చర్యలపై సమావేశంలో చర్చించారు. 2026-27లో పొగాకు ఉత్పత్తిని సుమారు 81 మిలియన్ కిలోలకు పరిమితం చేస్తూ రైతులకు అవగాహన కల్పిస్తామని మంత్రి తెలిపారు. గత నాలుగు రోజులుగా కొనుగోళ్లు ఊపందుకున్నాయని... రోజుకు 8.5 లక్షల కిలోల పొగాకు కొనుగోలు జరుగుతోందన్నారు. ప్రస్తుతం గరిష్ఠ ధర రూ. 250గా ఉందని.. ధర మరింత పెరిగేలా కంపెనీలపై ఒత్తిడి తీసుకురావాలని టొబాకో బోర్డుకు మంత్రి సూచించారు. కొనుగోళ్లు వేగవంతం కావడంతో రైతులకు మరింత మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందన్నారు. తక్కువ నాణ్యత గల పొగాకుకూ గిట్టుబాటు ధర లభించేలా కంపెనీలతో చర్చించాలని టొబాకో బోర్డు చైర్మన్, ఈడీకి మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి పాల్గొన్నారు.

శనివారం,
జూలై 18, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# వెంటపడి వేధిస్తున్నాడని చెంపపై కొట్టిన బాలిక
# ఆమెను నాలుగో అంతస్తు నుంచి తోసిన వ్యక్తి





**లక్నో:** వెంటపడి వేధిస్తున్న వ్యక్తి చెంపపై ఒక బాలిక కొట్టింది. ఆమెను కిడ్నాప్ చేసిన అతడు బిల్డింగ్ నాలుగో అంతస్తు నుంచి కిందకు తోశాడు. తీవ్రంగా గాయపడిన ఆ బాలిక చికిత్స పొందుతూ మరణించింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కౌశాంబి ప్రాంతంలోని భావపూర్‌లో నివసించే 15 ఏళ్ల ఖుషీని అదే ప్రాంతానికి చెందిన 30 ఏళ్ల షానావాజ్ వెంటపడి వేధించినట్లు ఆమె కుటుంబం ఆరోపించింది. ఈ నేపథ్యంలో అతడి చెంపపై ఆమె కొట్టిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా, జూలై 15న రాత్రి 10 గంటల సమయంలో పాల ప్యాకెట్ కొనేందుకు ఖుషి తన ఇంటి నుంచి బయటకు వచ్చింది. సమీపంలోని షాపునకు వెళ్లింది. ఆ బాలికను గమనించిన షానావాజ్ ఆమెను కిడ్నాప్ చేశాడని, బిల్డింగ్ నాలుగో అంతస్తుకు తీసుకెళ్లి అక్కడి నుంచి కిందకు తోసేసినట్లు ఆమె కుటుంబం ఆరోపించింది. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలికను ఢిల్లీలోని జీటీబీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మరణించింది. ఈ నేపథ్యంలో మృతురాలి తల్లి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. షానావాజ్‌ను అరెస్ట్ చేశారు. అయితే పోలీసుల విచారణలో ఈ ఆరోపణలను నిందితుడు ఖండించాడు. ఆ అమ్మాయిని తాను తోయలేదని షానావాజ్ చెప్పాడు. తాను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండగా, ఆ బాలిక నాలుగో అంతస్తుకు వెళ్లినట్లు తెలిపాడు. కూల్‌డ్రింక్ కొనివ్వమని అక్కడి నుంచి తనను పిలిచిందని, అయితే ఉన్నట్టుండి జారి కింద పడిందని పోలీసులకు చెప్పాడు. ఈ నేపథ్యంలో ఈ కేసుపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

## వృద్ధురాలి ఫ్లాట్‌ను ఆక్రమించిన బీజేపీ నేత
## గుడ్లతో దాడి చేసిన స్థానికులు





**కోల్‌కతా:** వృద్ధురాలి ఫ్లాట్‌లో అద్దెకు నివసించిన బీజేపీ నేత గడువు ముగిసినప్పటికీ ఖాళీ చేయలేదు. అపార్ట్‌మెంట్ ఫ్లాట్‌ను బల వంతంగా ఆక్రమించుకున్నాడు. స్థానికుల ఆందోళనతో పోలీసులు అక్కడకు చేరుకు న్నారు. ఆ బీజేపీ నేతను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా స్థానికులు గుడ్లతో దాడి చేశారు. బీజేపీ కొత్తగా అధికారంలోకి వచ్చి న పశ్చిమ బెంగాల్‌లో ఈ సంఘటన జరిగి ంది. న్యూటౌన్ బీజేపీ నేత బరున్ బిస్వాస్ 2018లో ఒక అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌ను అద్దెకు తీసుకున్నారు. అద్దె ఒప్పందం గడువు ముగిసిన తర్వాత యజమాని పదేపదే కోరినప్పటికీ ఖాళీ చేసేందుకు నిరాకరిం చారు. వృద్ధురాలికి చెందిన ఫ్లాట్‌ను ఆక్రమి ంచేందుకు ఆయన ప్రయత్నించారుకాగా, ఈ విషయం తెలుసుకున్న స్థానికులు బీజేపీ నేత బరున్ బిస్వాస్ తీరుపై ఆగ్రహించారు. ఆ అపార్ట్‌మెంట్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. స్థానికులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. మరోవైపు వృద్ధురాలి ఫిర్యాదుతో బరున్ బిస్వాస్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనను పోలీస్ స్టేషన్‌కు తరలిస్తుండగా స్థానికులు గుడ్లతో దాడి చేశారు. 'దొంగా.. దొంగా' అని నినాదించారు. టీఎంసీ నాయకులపై గుడ్లు విసరడంతో మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు అధికార బీజేపీ నేతలకే చుట్టుకున్నది. అయ్యింది.

# రేపు నింగిలోకి విక్రమ్-1




**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన ప్రైవేట్ ఏరోస్పేస్ కంపెనీ 'స్కైరూట్' తయారు చేసిన 'విక్రమ్-1రాకెట్ ప్రయోగంఉదయం 11:30 గంటలకు శ్రీహరికోట నుంచి నిర్వహించనున్నారు. ప్రైవేట్ రంగంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రాకెట్ దేశంలోనే తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్‌గా రికార్డు సృష్టించనుంది. ఈ రాకెట్ 23 మీటర్ల ఎత్తు, 1.7 మీటర్ల వెడల్పు ఉండి 350 కిలో పేలోడ్లను మోసుకెళ్లుంది. ఇది మూడు దశల సాలిడ్ కాన్ఫిగరేషన్‌తో పాటు ద్రవ ఇంధనంతో పనిచేసే ఆర్బిటల్ అడ్జస్ట్‌మెంట్ మాడ్యూల్ (వోఏఎమ్)ను ఉపయోగిస్తుందిమిషన్ ఆగమన్' పేరుతో చేపడుతున్న ఈ ప్రయోగంలో స్కైరూట్ కు చెందిన స్కోప్ ఉపగ్రహం, బెంగళూరుకు చెందిన కాస్మోస్ డైమండ్స్ రూపొందించిన ప్రయోగశాలలో తయారు చేసిన తామర పువ్వు ఆకారంలోని వజ్రం అంతరిక్షంలోకి పంపనున్నట్లు స్కైరూ ట్ ప్రతినిధులు శుక్రవారం తెలిపారు. అలాగే విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాం, సీవీ రామన్‌లకు నివాళిగా వారి సూక్ష్మ శిల్పాలతో పాటు ప్రధాని మోదీ ప్రత్యేకంగా రాసిన సందేశాన్ని కూడా పంపుతున్నామని చెప్పారు.

## వర్షాకాల సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు
## రాజ్‌నాథ్ నివాసంలో మంత్రుల భేటీ



**న్యూఢిల్లీ:** డీలిమిటేషన్ మహిళా రిజర్వేషన్ బిల్లులను మళ్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నది. త్వరలో ప్రారంభంకానున్న వర్షాకాల సమావేశాల్లో ఆ రెండు బిల్లులను మళ్లీ ఉభయసభల్లో పెట్టాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలిసింది. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ నివాసంలో ఇవాళ జరిగిన భేటీలో ఈ అంశంపై చర్చ చేసినట్లు తెలిసింది. ఏప్రిల్‌లో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లును ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కానీ మూడో వంతు మెజారిటీ లేకపోవడంతో ఆ రెండు బిల్లులు వీగిపోయాయి. ఎన్డీఏ మంత్రులతో ఇవాళ రాజ్‌నాథ్ సింగ్ సమావేశం నిర్వహించారు. వర్షాకాల పార్లమెంట్ సమావేశాలకు చెందిన వ్యూహాన్ని రచించిన ట్లు తెలిసింది. వివిధ రాజకీయ పార్టీల అంతరంగాన్ని తెలుసుకునేందుకు కొందరు మంత్రులకు బాధ్యతలు అప్పగించారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్ విభజన ప్రక్రియను పూర్తి చేసేందుకు అనేక రాజకీయ పార్టీలతో ఏకాభిప్రాయం కోసం కేంద్రం ప్రయత్నిస్తున్నది. అన్ని రాష్ట్రాల్లోనూ 50 శాతం లోక్‌సభ సీట్లను పెంచే హామీతో కొత్త డీలిమిటేషన్ బిల్లును తెచ్చేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నది. ఏప్రిల్‌లో జరిగిన సమావేశాల్లో అన్ని పార్టీలు 50 శాతం నిబంధన పెట్టాలని డిమాండ్ చేసిన విషయం తెలిసిందే. అయితే 50 శాతం సీట్ల పెంపు అంశంలో రాతపూర్వక వివరణ ఇస్తే బిల్లు గురించి చర్చిస్తామని ఎన్సీపీ నేత సుప్రియా సూలే తెలిపారు. ప్రస్తుతం లోక్‌సభలో 543 సీట్లు ఉన్నాయి. దీంట్లో మూడో వంతు అంటే 362 మంది అనుకూలంగా బిల్లుకు ఓటేయాల్సి ఉంటుంది. మూడు సీట్లు ఖాళీగా ఉన్నాయి. దీంతో మూడో వంతు 360కి తగ్గుతుంది. అయితే ఏప్రిల్‌లో బిల్లు వీగిపోయింది. అప్పుడు అనుకూలంగా 298 మంది , వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. ఈ దశలో ఎన్డీఏకు 293 మంది ఎంపీలు ఉన్నారు. తాజాగా 20 మంది టీఎంసీ , శివసేన యూబీటీ రెబల్ ఎంపీలు ఆ పార్టీకి మద్దతు ఇస్తున్నారు. దీంతో ఎన్డీఏ సంఖ్య 319కి చేరుతుంది. అయినా కానీ ఇంకా మూడో వంతు మెజారిటీకి దూరమే అవుతుంది. అయితే 22 ఎంపీ సీట్లు ఉన్న డీఎంకేపైనే ఇప్పుడు అందరి ఫోకస్ ఉంటుంది. డీఎంకేతో పాటు ఎన్సీపీ ఎస్పీ కూడా మద్దతు ఇస్తే అప్పుడు డీలిమిటేషన్ బిల్లు గట్టెక్కే అవకాశం ఉన్నది.

## మెడకు ఉరితాళ్లు చితిపై పడుకుని
## గిరిజనుల నిరసన ఎందుకంటే



**భోపాల్:** గిరిజన ప్రజలు ముఖ్యంగా మహిళలు గత కొన్ని రోజులుగా వినూత్నంగా నిరసన చేస్తున్నారు. దేశంలోని తొలి నదుల అనుసంధాన ప్రాజెక్ట్ వల్ల తమ ఉనికి కోల్పోతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. మెడకు ఉరితాళ్లు తగిలించుకోవడంతో పాటు చితిపై పడుకుని, నడుం లోతు నీటిలో నిల్చొని నిరసన తెలుపుతున్నారు. తమ సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. దేశంలోని తొలి నదుల అనుసంధాన కార్యక్రమం ఊపందుకున్నది. రూ.44,605 కోట్ల వ్యయంతో కెన్-బెట్వా నదీ అనుసంధాన ప్రాజెక్ట్ చేపడుతున్నారు.

కాగా, మధ్యప్రదేశ్‌లోని ఛతర్‌పూర్ జిల్లాకు చెందిన గిరిజనులు ఈ ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వ్యవసాయ భూములు, అడవులు, నీటి వనరులు, జీవనోపాధి, సాంస్కృతిక గుర్తింపును తాము కోల్పోతున్నట్లు ఆందోళన చెందుతున్నారు. పూర్తి నష్ట పరిహారం చెల్లించకుండా తమ భూము లను స్వాధీనం చేసుకున్నారని, ఆందోళన చేస్తున్న తమపై తప్పుడు కేసులు పెడుతు న్నారని, పలు కుటుంబాలను అధికారిక పున రావాస జాబితాల నుంచి మినహాయించినట్లు ఆరోపించారు. మరోవైపు భూములు కోల్పో వడం, పునరావాసం, నష్ట పరిహారం వంటి డిమాండ్ల కోసం జై కిసాన్ ఆర్గనైజేషన్ నాయకుడు అమిత్ భట్నాగర్ నేతృత్వంలో ఈ ప్రాంత గిరిజనులు గత కొన్ని రోజులుగా వినూత్నంగా నిరసనలు చేస్తున్నారు. మెడకు ఉరితాళ్లు బిగించుకుని, చితిపై పడుకుని, బరన్ నదిలో నడుము లోతు నీటిలో నిలబడి నిరసన తెలియజేస్తున్నారు. కేవలం నష్టపరిహారం కోసం మాత్రమే కాకుండా, తరతరాలుగా ఇక్కడి భూమిపై తమ మూలాలను నిలుపుకునే హక్కు కోసం తాము పోరాడుతున్నామని వారు చెబుతున్నారు. ఈ ప్రాంత గిరిజనుల ఆందోళనలు, నిరసనలకు ప్రతిపక్ష పార్టీలు తమ మద్దతు తెలిపాయి. ఈ నేపథ్యంలో వీరి ఆందోళనలు తీవ్రమయ్యాయి. అయితే గిరిజనుల ఆరోపణలను అధికారులు ఖండిస్తున్నారు. అలాగే వారితో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు, కలెక్టర్ వెల్లడించారు.

# లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హమ్
# త్వరలో బ్రిటన్ ప్రధాని




**లండన్:** బ్రిటన్‌లోని లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హమ్ కన్ఫర్మ్ అయ్యారు. తన నాయకత్వంలో పార్టీని నడిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు. మాజీ ప్రధాని కీర్ స్టార్మర్ ఆశయాలకు తగినట్లు పార్టీని నిర్మించనున్నట్లు చెప్పారు. పార్టీ నేతగా స్టార్మర్ ఉన్న సమయంలో.. ఓటమి దశ నుంచి పార్టీ అద్భుత విజయాన్ని నమోదు చేసిందని, లేబర్ పార్టీ ఇప్పుడు ప్రజల జీవితాలను మార్చేస్తోందన్నారు. వచ్చే వారం 10 డౌనింగ్ స్ట్రీట్‌లో ప్రధాని బాధ్యతలు ఆండీ బర్న్‌హమ్ స్వీకరించే అవకాశాలు ఉన్నాయి. లేబర్ పార్టీ నేతగా ఆండీ బర్న్‌హమ్ నియమితుడైన విషయాన్ని ఆ పార్టీ నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మెన్ షాబానా మహమూద్ ప్రకటించారు. కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు ఆండీ బర్న్‌హమ్‌ను సోమవారం మూడవ కింగ్ చార్లెస్ ఆహ్వానించే అవకాశాలు ఉన్నాయి. కీర్ స్టార్మర్ తన రాజీనామా సమర్పించిన తర్వాత ఈ ప్రక్రియ జరగనున్నది.

## యూరప్‌లో వేడిగాలులతో 12000 మంది మృతి
## మరింత పెరిగే అవకాశం



**యూరప్:** శీతల ఖండం యూరప్ లో వేడిగాలులు ప్రజ ల్లో వణుకు పుట్టిస్తున్నాయి. పలు దేశాలు హీట్ డోమ్ వల్ల ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ప్రచండ వేడి గాలులను తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతు న్నారు. అనేక దేశాలలో ప్రమాదకర స్థాయిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు పెరుగుతుండంటంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు.

ఒక్క జూన్‌లో సంభవించిన వేడిగాలులతోనే 9 యూరోపియన్ దేశాలలో కనీసం 12,000 మంది చనిపోయి నట్లు పలు గణాంకాల వెల్లడిస్తున్నాయి. ముఖ్యంగా బెల్జియం, ఫ్రాన్స్, జర్మనీ, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్ దేశాలు హీట్ వేవ్‌కు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతల కారణంగా గుండె, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు మరింత తీవ్ర మవ్వడం తోదాదాపు 85% మంది 65 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు మృతి చెందారని పలు ఆరోగ్య సంస్థలు వెల్లడించాయి. ఇంకా ఈ మరణా లు పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తీవ్రమైన వడగాడ్పులు అంతటా విస్తరిస్తుండడంతో యూరప్‌లోని అనేక ప్రాంతాలు ప్రస్తుతం తీవ్రమైన వాతా వరణ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు అనేక దేశాలలో జనజీ వనం, ప్రజారోగ్యం, మౌలిక సదుపాయాలపై ప్రభావం చూపుతున్నాయి. ఇవి మానవ తప్పి దాల వల్లే జరుగుతున్నా యని, వీటిని సరి చేయలేక భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వరల్డ్ వెదర్ అట్రిబ్యూషన్‌కు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు.

# బాలిస్టిక్ క్షిపణులతో దాడి
## అమెరికా యుద్ధ విమానాలు ధ్వంసం ఐఆర్జీసీ

**టెహ్రాన్:** ఇరాన్ భారీ దాడిచేసింది. అమెరికాకు చెందిన మిలిటరీ విమానాలను ధ్వంసం చేసింది. జోర్డాన్‌లో ఉన్న అమెరికా బేస్‌పై అటాక్ జరిగింది. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో ఇరాన్ దాడి చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. గత రాత్రి జరిగిన దాడులకు ప్రతీకారంగా అమెరికా స్థావరాలపై ఇరాన్ విరుచుకుప డినట్లు తెలుస్తోంది. ఆ దాడుల్లో 8 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇరాన్‌కు చెందిన సుమారు మూడు క్షిపణులను కూల్చినట్లు జోర్డాన్ మిలిటరీ వెల్లడించింది. ఇవాళ జరిగిన దాడి గురించి ఇరాన్స్ రెవల్యూషనరీ గార్డ్స్ ఓ ప్రకటన చేసింది. అమెరికా వైమానిక దళానికి చెందిన అనేక రీఫ్యూయలింగ్ విమానాలు, యుద్ధ విమానాలను ధ్వంసం చేసినట్లు ఐఆర్జీసీ తెలిపింది. సిరియాలో ఉన్న అల్ తానఫ్ అమెరికా స్పెషల్ ఆపరేషన్స్ కమాండ్ సెంటర్‌ను కూడా అటాక్ చేసినట్లు ఐఆర్జీసీ ప్రకటించింది. వరుసగా ఆరో రోజు గురువారం రాత్రి అమెరి కా వైమానిక దాడులు చేసింది. ఇరాన్ మౌళిక సదుపాయాలను టార్గెట్ చేసింది. ఆ దేశంలో ఉన్న అనేక బ్రిడ్జీలను నేలమట్టం చేసింది. అయితే ఈ దశలో ఇరాన్ తీవ్ర హెచ్చరిక చేసింది. ఒకవేళ దాడులు ఉధృతం అయితే, అప్పుడు యావత్ పశ్చిమాసియా ప్రాంతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇరాన్ తన హెచ్చరికలో పేర్కొన్నది. హర్మోజ్‌గన్ ప్రావిన్సులో జరిగిన దాడుల్లో అయిదు బ్రిడ్జీలను అమెరికా విమాన సిబ్బంది పేల్చేసింది. కీలకమైన బందర్ అబ్బాస్ పోర్టు నగరానికి లింకున్న బ్రిడ్జీలను కూల్చివేసినట్లు తెలుస్తోంది. బహ్రెయిన్‌లోని సాకిర్ ఎయిర్ బేస్‌లో ఉన్న అమెరికా హెలికాప్టర్లు, రికనయిసెన్స్ విమానాలను ధ్వంసం చేసినట్లు ఇరాన్ చెబుతోంది. మరోవైపు అలారం సైరన్లు మోగించినట్లు బహ్రెయిన్ మంత్రి పేర్కొన్నారు. ప్రజలు సంయమనంతో ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. కానీ ఎయిర్‌బేస్ మీద అటాక్ జరిగినట్లు అమెరికా, బహ్రెయిన్ అధికారులు ఇంకా కన్ఫర్మ్ చేయలేదు.

## అమెరికా ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకుందన్న
## ట్రంప్ తీవ్రంగా ఖండించిన చైనా



**చైనా :** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ఆరోపణలను చైనా ప్రభుత్వం పూర్తిగా ఖండించింది. 2020 అధ్యక్ష ఎన్నికల సమయంలో తనను ఓడించడానికి చైనా భారీ డేటా హ్యాకింగ్‌కు పాల్పడిందంటూ ట్రంప్ చేసిన వాదనలు ఆధారం లేనివి, దురుద్దేశపూర్వకమైనవి అని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి స్పష్టం చేశారు. తాము అమెరికా ఎన్నికల్లో ఎప్పుడు తలదూర్చలేదని, భవిష్యత్‌లోను జోక్యం చోసుకోమని చైనా దౌత్య కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. తప్పుడు ఆరోపణలతో అమెరికా చైనాను అప్రతిష్ట పాలు చేయాలని చూస్తున్నదని ఆరోపించారు. వారి దేశంలో జరిగే ఎన్నికల్లో జోక్యం చేసుకునే ఆసక్తి ఏమాత్రం లేదని చైనా స్పష్టం చేసింది. కాగా, అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో డ్రాగన్ దేశం చైనా జోక్యం చేసుకున్నట్లు డోనాల్డ్ ట్రంప్‌ఆరోపించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసం గించారు 2020 దేశాధ్యక్ష ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నదని, అమెరికా ఓటింగ్ విధానం తీవ్ర ప్రభావానికి గురైందని, అయితే ఓటర్లను మార్చిన అంశంపై మాత్రం ఆయన క్లారిటీ ఇవ్వలేదు. ఎన్నికల ఫలితాలను కూడా మార్చినట్లు ట్రంప్ నేరుగా పేర్కొనలేదు. వైట్‌హౌజ్ నుంచి ఆయన మాట్లాడుతూ.. ఓటింగ్ ఫ్రాడ్ జరిగినట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ దానికి సంబంధించిన ఆధారాలను మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. 2020 దేశాధ్యక్ష ఎన్నికల్లో జరిగిన హోరాహోరీ పోరులో జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓటమి పాలయ్యారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్, బ్యాలెట్ కౌంటింగ్ వ్యవస్థల్లో అక్రమాలు జరిగినట్లు వైట్‌హౌజ్ సుమారు నాలుగు సెక్షన్ల డాక్యుమెంట్లను రిలీజ్ చేసింది. అమెరికా ఓటరు డేటాను చైనా దుర్వినియోగం చేసినట్లు ట్రంప్ పేర్కొన్నారు.


# సంపాదకీయం



## హాట్‌హాట్‌గా సాగనున్న పార్లమెంట్ !

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు సమయం ఆసన్నమైంది. ఈ సమావేవాలు అత్యంత ప్రాధాన్యాన్ని సంతరించుకోబోతున్నాయి. ఈ క్రమంలో ఎవవరి వ్యూహాల్లో వారు ఉన్నారు. విపక్ష పార్టీలు కూడా తగిన వ్యూహాలతో సిద్ధం అవుతున్నారు. అధికార పార్టీ వేసే ఎత్తుగడలకు ధీటుగా నిలవాలని ఇండియా కూటిమి సన్నద్ధం అవుతోంది. సోమవారం నుంచి సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత జరుగుతున్న సమావేశాలు కాబట్టి ఈసారి హాట్‌హాట్‌గా జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు కాంగ్రెస్ వ్యూహం సిద్ధం చేసింది. అయోధ్య రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, విద్యా వ్యవస్థలో అవ్యవస్థలు, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు వంటి కీలక అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీయాలని నిర్ణయించింది. అలాగే నియోజక వర్గాల పునర్విభజన, మంత్రులు-ముఖ్యమంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. డీలిమిటేషన్‌పై అఖిలపక్ష భేటీ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అయితే అధికార ఎన్‌డిఎ పెద్దగా పట్టించుకోవడం లేదు. గత పార్లమెంట్ సమావేశాలకు ముందు కూడా ఇలాంటి డిమాండ్ వచ్చింది. అయినా కేంద్రం పెద్దగా పట్టించుకోలేదు. పార్లమెంటులో చర్చించే ముందు అఖిలపక్షంతో చర్చించడం ఆనవాయితీ ఉండేది. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దానిని తుంగలో తొక్కారు. అఖిలపక్షాలు ఏర్పాటు చేయడం, చర్చించడం మోడీకి పెద్దగా ఇష్టం ఉండదని గత 12 ఏళ్లుగా చూస్తున్నాం. ఇకపోతే జూలై 20 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశమై వ్యూహాన్ని ఖరారు చేసుకుంది. రామ మందిర విరాళాల దుర్వినియోగం, ప్రశ్నాపత్రాల లీకులు, విద్యా వ్యవస్థలో క్షీణత, రాజ్యాంగ సంస్థల బలహీనత, రాజకీయ పార్టీల విభజన, అవినీతి, ధరల పెరుగుదల, విదేశాంగ వైఫల్యాలు, ఎథనాల్ మిశ్రమ ఇంధన విధానం, అటవీ నరికివేత, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల హక్కులపై దాడులు వంటి అంశాలపై మోడీ ప్రభుత్వాన్ని నిలదీస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లి కార్జునఖర్గే తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా డీలిమిటేషన్ బిల్లును మళ్లీ తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్.. ఆరోపించారు. ఏప్రిల్ 17న ప్రభుత్వం రెండు మూడవ వంతు మెజారిటీ సాధించడంలో విఫలమైందని, ఇప్పుడు మరోసారి అదే బిల్లును తీసుకురావాలని చూస్తోందన్నారు. డీలిమిటేషన్ బిల్లును కాంగ్రెస్ గతంలో ఎలా వ్యతిరేకించిందో ఇప్పటికీ అదే వైఖరి కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలాగే 30 రోజుల పాటు జైలులో ఉన్న మంత్రులు, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే రాజ్యాంగ సవరణ బిల్లును కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. వన్ నేషన్-వన్ ఎలక్షన్ అంశంపై ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ జేపీసీపై కూడా సమావేశంలో చర్చ జరిగినట్లు జైరాం రమేష్ తెలిపారు. అలాగే వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు, ఎఫ్‌సీఆర్ఏ సవరణ బిల్లు, జాతీయ ఆహార భద్రత చట్టం-2013 సవరణలు వంటి బిల్లులను కూడా కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం తీసుకురానున్న శాసనసభ్య కార్యక్రమాల్లో కాంగ్రెస్ మద్దతు ఇవ్వగల బిల్లు ఏదీ కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.

మహిళా రిజర్వేషన్‌ను ప్రస్తుత లోక్‌సభ స్థానాల సంఖ్య ఆధారంగానే అమలు చేస్తే కాంగ్రెస్ పూర్తిగా మద్దతు ఇస్తుందని జైరాం రమేష్ స్పష్టం చేశారు. అమిత్ షా రాజకీయ పార్టీలను చీల్చి రెండు మూడవ వంతు మెజారిటీ సాధించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన ఆయన.. అది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి అవమానమని విమర్శించారు. అయితే బీజేపీకి లోక్‌సభలో రెండు మూడవ వంతు మెజారిటీ సాధ్యం కాదని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంట్ సమావేశాలకు ముందు ఇండియా కూటమి సోమవారం వ్యూహ సమావేశం నిర్వహించనుంది. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఆదివారం అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశమై వర్షాకాల సమావేశాల్లో చర్చించాల్సిన అంశాలపై చర్చించనుంది. జూలై 20 నుంచి ప్రారంభ మయ్యే పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు, ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రుల తొలగింపుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులతో పాటు పలు కీలక బిల్లులను ప్రభుత్వం ప్రవేశపెట్టే అవకాశం ఉంది. మరోవైపు నీట్ ప్రశ్నాపత్రాల లీక్, రామ మందిర విరాళాల దుర్వినియోగం ఆరోపణలు, పెరుగుతున్న చమురు ధరలు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కేంద్రం కూడా తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అన్నచందంగా వ్యవహరి స్తోంది. దేశం అనేకానేక సమస్యలు ఎదుర్కొంటున్నా, వాటిని పెద్దగా పట్టించుకోవడం లేదు. వాటిపై చర్చించి నిర్ణయం తీసుకునే చొరవ కూడా తీసుకోవడం లేదు. మొత్తంగా ఈ సమావేశా ల్లో డీలిమిటేషన్ బిల్లు ప్రవేశ పెడితే ఎలా నెగ్గుకు వస్తారన్నదే ఆసక్తిగా మారింది. మహిళా బిల్లును కలిపే పెడతారా అన్నది తెలియదు. అఖిలపక్షంలో చర్చించేందుకు ఎందుకనో మోడీ ఇష్టపడడం లేదని తెలుస్తోంది. అదేదో పార్లమెంటులోనే చర్చించాలన్నది ఆయన వ్యూహంగా ఉన్నట్లు అర్థం అవుతోంది.



# బిల్లుల పాస్ కోసం బిజెపి వ్యూహం

**• విపక్ష పార్టీలను బుట్టలో వేసుకునే యత్నం • ఈసారి రాజ్యాంగ సవరణ వీగిపోతే బిజెపి పరవు పోయినట్లే...**

**న్యూఢిల్లీ,జులై17:** గత పార్లమెంట్ సమావేశాల్లో మహిళా బిల్లు, డీలిమిటేషన్ బిల్లులు వీగిపోవడంతో బిజెపి మరింత పట్టుదలగా అడుగులు వేస్తోంది. బిల్లులు ఆమోదింపచేసుకోవడానికి ఇదే సమయమని కమలనాథులు భావిస్తున్నారు. అయితే చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించేందుకు మాత్రం ఆ పార్టీ ముందుకు రావడం లేదు. గత సెషన్‌లో బిజెపి వ్యూహాత్మకంగా ఉందని అంతా భావించారు. కానీ ఓటింగ్ సమయంలో దానికి వ్యూహం లేదని తేలిపోయింది. ప్రతిపక్ష పార్టీలే ఓ రకంగా వ్యూహాత్మకంగా నిలిచి తమ పట్టును నిలబెట్టుకున్నాయి. దీంతో రాజ్యాంగ సవరణ బిల్లులు బలం లేకపోవడంతో వీగిపో యాయి. ఇప్పుడు మరోమారు ప్రయత్నంలో బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేదా అన్న చర్చ నడుస్తోంది. ఈ క్రమంలో లోక్‌సభ సీట్లను 2011 జనాభా లెక్కల ఆధారంగానే పెంచడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో ఎట్టిపరిస్థితు ల్లోనూ నెగ్గించుకోవాలన్న పట్టుదలతో భాజపా నాయకత్వం పనిచేస్తోంది. 2/3వ వంతు ఆధిక్యం లేకపోవడంతో బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు వీగిపోవడం అధికారపక్షానికి ఇబ్బందికరంగా పరిణమించింది. తర్వాత ప్రతిపక్షం దూకుడు మొదలుపెట్టింది. ఇటీవల అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. తృణమూల్‌కు చెందిన 28 మంది లోక్‌సభ సభ్యుల్లో 20 మంది వేరుకుంపటి పెట్టుకొని అధికారపక్షానికి మద్దతు పలికారు. ఇండియా కూటమితో డీఎంకే తెగదెంపులు చేసుకుంది. ఈ రెండు అవకాశాలను అనుకూలంగా మలచుకునే పనిలో భాజపా నాయకత్వం తలమునకలైంది. ఇదివరకు డీలిమిటేషన్ బిల్లులో సీట్లపెంపు ప్రతిపాదన ఉన్నా దానికి ప్రాతిపదికను పెట్టలేదు. ఈసారి అలాకాకుండా.. రాష్ట్రాల్లో ఇప్పుడున్న సీట్లను 50శాతం మేర పెంచుతామని, దానివల్ల లోక్‌సభలో ప్రాతినిధ్య నిష్పత్తి యథాతథంగా కొనసాగుతుందని భరోసా ఇవ్వడానికి బిజెపి సమాయత్తమైంది. ఈ మార్పునకు ఇప్పటికే ఇండియా కూటమిలోని శరద్‌పవార్ పార్టీ ఆకర్షితమైంది. 50శాతం సీట్లు పెంచేలా బిల్లులో స్పష్టత ఇస్తే మద్దతు ఇవ్వడానికి అభ్యంతరం లేదని ప్రకటించింది. డీఎంకే కూడా వ్యతిరేకించకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. భాజపా నాయకత్వం ఈ అంశంపై అన్ని పార్టీలతో తెరవెనుక మంత్రాంగం నెరపుతోంది. ప్రధానంగా డిఎంకె, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపిలను బుజ్జగిస్తున్నట్లు తెలుస్తోంది. తృణమూల్ చీలిపోవడం, మరోపార్టీ ఇండియా కూటమికి దూరంగా ఉండటంతో తమకు ఇంతకంటే మంచి తరుణం రాదని భావించి.. మిగిలిన పార్టీల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను కమలనాథులు ముమ్మరం చేశారు. ఇప్పటికే భాజపా అత్యున్నత నాయకత్వం ప్రధానమంత్రి నివాసంలో దీనిపై చర్చించి వ్యూహరచన చేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం లోక్‌సభలో ఎన్డీయే కూటమికి 293 సీట్లున్నాయి. తృణమూల్ నుంచి విడిపోయిన 20 మంది, ఉద్ధవ్‌ఠాక్రే శివసేన నుంచి బయటపడిన ఆరుగురు ఎంపీలను కలిపితే ఆ సంఖ్య 319కి చేరనుంది. శరద్‌పవార్ పార్టీకి చెందిన 8 మంది మద్దతు లభిస్తే 327కి, డీఎంకే అండగా నిలిస్తే ఈ సంఖ్య 349కి చేరుతుంది. 2/3వ వంతు బలమైన 360ని చేరుకోవడానికి మరో 11మంది అవసరమవుతారు. వైకాపాకు చెందిన నలుగురు, ఒక స్వతంత్ర సభ్యుడు మద్దతు పలకడానికి సిద్ధంగా ఉన్నారు. అంటే ఇంకా ఆరుగురు తక్కువవుతారు. ఒకవేళ డీఎంకే గైర్హాజరైతే సభ సంఖ్యాబలం 518కి తగ్గుతుంది. అప్పుడు హాజరైన వారిలో 346 మంది మద్దతిస్తే చాలు. సభలోని 540 మంది హాజరైతేనే మెజార్టీకి 360 మంది అవసరం అవుతారు. మొత్తంగా బిజెపి వ్యూహం ఫలిస్తుందా లేకపోతే బెడిసి కొడుతుందా అన్నది చూడాలి.

# మారుతున్న మహారాష్ట్ర రాజకీయం

**విలీనం దిశగా ఎన్సీపి వర్గాల చర్చలు**

**మరింత బలహీనంగా ఉద్ధవ్ శివసేన**

**ముంబై,జులై17:** మహారాష్ట్ర రాజకీయాలు రంజుగా సాగుతున్నాయి. అధికార ఎన్‌డిఎ తనకు అనుకూలంగా పరిస్థితులను మార్చుకుంటోంది. అలాగే ఎన్సీపిని బలోపేతం చేసి అంటే రెండు వర్గాలను కలిపి దగ్గరకు తీసుకోవాలని చూస్తోంది. శరద్ పవార్ కూతురు సుప్రియా సులఅఏకు మంత్రి పదవిఒ కట్టబెట్టడం ఖాయంగా కనిపిస్తోంది. ఇకపోతే ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన ఇప్పటికే బలహీన పడింది. ఇదంతా ఒక ఎత్తయితే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లో ఉత్కంఠ నెలకొనడంతో మహారాష్ట్ర రాజకీయం మరింత ముదురుతోంది. అధికార కూటమికి చెందిన అజిత్ పవార్ వర్గం ఎన్‌సీపీలో, శరద్ పవార్(ఎస్పీ) నేతృత్వంలోని ఎన్‌సీపీ(ఎన్‌పీ)లో అంతర్గత పరిణామాలు వేగంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో జరిగిన వరుస భేటీలు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊహాగానాలకు తెరతీస్తున్నాయి. ఎన్‌సీపీ సీనియర్ నేతలు ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరే ఇటీవల సీఎం ఫడణవీస్‌ను కలవడం కూడా చర్చనీయాంశమైంది. ఆ మరుసటి రోజే డిప్యూటీ సీఎం సునేత్ర పవార్ కుమారుడు, ఎంపీ పార్థ్ పవార్ కూడా ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు. ఈ భేటీలపై అధికారికంగా ఎలాంటి సమాచారం అందకపోయినా.. రాజకీయంగా మాత్రం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక.. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు ప్రస్తుతం పార్టీ వ్యవహారాల్లో తమకు ప్రాధాన్యం తగ్గిందనే అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. అజిత్ పవార్ మరణానంతరం.. ఆయన సతీమణి సునేత్ర పవార్ పార్టీ బాధ్యతలు చేపట్టగా, కుమారుడు పార్థ్ పవార్ కూడా పార్టీ వ్యవహారాల్లో ఎక్కువగా కల్పించుకుంటుండంతో కొందరు సీనియర్ నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అయితే.. పార్టీని సరిదిద్దే చర్యలు తీసుకోవాలని ప్రఫుల్ పటేల్ ఇటీవల బహిరంగంగా అనడం ఈ వాఖ్యలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. మరోవైపు పార్టీ జాతీయ కార్యదర్శి సచ్చిదానంద్ సింగ్.. సునేత్ర పవార్‌ను పార్టీ అధ్యక్షురాలిగా నియమించడాన్ని ప్రశ్నిస్తూ, ఆ ఎన్నిక చెల్లదని బహిరంగంగా వ్యాఖ్యానించడమూ పార్టీలో అసంతృప్తిని బయటపెట్టింది. మరోవైపు.. ఎస్పీ వర్గానికి చెందిన సీనియర్ నేత జయంత్ పాటిల్ కూడా ఇదే సమయంలో సీఎం ఫడణవీస్‌ను కలవడం రాజకీయ చర్చలకు మరింత ఊతమిచ్చింది. ప్రత్యర్థి వర్గాలకు చెందిన ముగ్గురు కీలక నేతలు ఏకకాలంలో ఇలా సీఎంను కలవడం వెనుక రాజకీయ ప్రాధాన్యం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. యితే.. ఈ సమావేశాలు పూర్తిగా పాలనా అంశాలకే సంబంధించినవని సునీల్ తట్కరే స్పష్టం చేశారు. ఇందులో రాజకీయ కోణమేమీ లేదని, విలీనంపైనా ఎలాంటి చర్చ జరగలేదని ఆయన చెప్పారు. అజిత్ పవార్ జీవించి ఉన్న సమయంలోనే రెండు ఎన్‌సీపీ వర్గాల విలీనంపై చర్చలు జరిగాయని, ప్రస్తుతం అలాంటి ప్రతిపాదనలేమీ లేవని పేర్కొన్నారు. మరోవైపు, ప్రఫుల్ పటేల్, సునీల్ తట్కరేలు శరద్ పవార్ వర్గానికి చెందిన కొందరు నేతలతో సంప్రదింపులు జరుపుతున్నారనే ప్రచారం కూడా సాగుతోంది. అయితే శరద్ పవార్ వర్గం ఈ వార్తలను ఖండించింది. తమ పార్టీ ఇప్పటికీ ఇండియా కూటమితోనే కొనసాగుతోందని ఆ పార్టీ ఎంపీ సుప్రియా సూలే స్పష్టం చేశారు. అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడకపోయినా, వరుస భేటీలు, పార్టీల్లో పెరుగుతున్న అసంతృప్తి, విలీనం లేదా రాజకీయ పునర్వ్యవస్థీకరణపై వినిపిస్తున్న ప్రచారం మహారాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. రానున్న రోజుల్లో ఈ పరిణామాలు ఎలాంటి మలుపు తిప్పుతాయనే ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# చైనా గురించి ఆయాస పడాలా!



'దీనమ్మ జీవితం' అన్నట్లుగా చైనాలో ఏ పరిణామం జరిగినా మీడియాలో కొందరు పెద్దలకు పండగే. అధినేత షీ జిన్‌పింగ్ మీద తిరుగుబాటు చేసి కొత్త నేతను ఎన్నుకుంటారంటూ గతంలో ఎంత యాగీ చేసిందీ చూశాము. తరువాత తేలుకుట్టిన దొంగల మాదిరి ఉన్నారు. చైనా ప్రభుత్వం, అభివృద్ధి, సాధించిన విజయాల గురించి ప్రకటించినపుడు అవన్నీ ఉత్తుత్తి అంకెలే అని పిట్టకతలు చెబుతారు. తాజాగా తొలి ఆరునెలల్లో ఆర్థిక రంగంలో తలెత్తిన వడిదుడుకుల గురించి ప్రస్తావించి వివరాలను ప్రకటించింది. దీన్ని పట్టుకొని ఇంకేముంది చైనా అధోగతి పాలవుతోందంటూ చిలవలు పలవలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. వర్తమాన సంవత్సరంలో తమ వృద్ధి రేటు లక్ష్యం 4.5 నుంచి ఐదు శాతం వరకు నిర్ణయిం చినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే ఆరు నెలల్లో వృద్ధి రేటు 4.7శాతమే నమోదైంది. మొదటి మూడు నెలల్లో ఐదుశాతం నమోదు కాగా తదుపరి అది 4.3శాతమే అయింది గనుక సంబర పడుతున్నారు. 'ఇంకా ఆరు నెలల సమయం ఉంది, ఇంకా పెరుగుతుందా, తగ్గుతుందా అన్నది అనేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. తాజా తగ్గుదలను గుణపాఠంగా తీసుకోవాలని' దేశ పౌరులకు ప్రభుత్వం చెప్పింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పెరుగుతున్నప్పటికీ ఆరునెలల్లో 4.7శాతం పెరుగుదలను తక్కువ అంచనావేసి చంకలు కొట్టుకొంటే ఆయాసం తప్ప ఇతర దేశాలకు ఒరిగేదేమీ ఉండదు.చైనాలో వృద్ధి రేటు ఎందుకు తగ్గిందో తులనాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వస్తూత్పత్తి ఫ్యాక్టరీగా పేరు తెచ్చుకున్న చైనా ఇటీవలి కాలంలో తక్కువ ధరల్లో తయారు చేసే వినిమయ వస్తువుల మీద కేంద్రీకరణ తగ్గించింది. అధునాతన సాంకేతిక ప్రక్రియలతో తయారయ్యే, హరిత ఉత్పత్తుల మీద కేంద్రీకరించి పశ్చిమ దేశాలకు సవాలు విసురుతోంది. మార్కెట్‌లో తీవ్రమైన పోటీని ఎదుర్కోవటం అంతతేలిక కాదు, అయినా 'పరుగెత్తి పాలు తాగటం కంటే నిలబడి నీళ్లు తాగటం' మేలన్నట్లు ముందుకు పోతోంది. చిప్స్, మొబైళ్ల తయారీకి ప్రోత్సాహకంగా రూ.1.89లక్షల కోట్లు కేటాయించినట్లు మన కేంద్ర ప్రభుత్వం పన్నెండేండ్ల తరువాత గొప్పగా ప్రకటించింది.అసలు లేనిదాని కంటే కుంటిదో గుడ్డిదో ఏదో ఒక గుర్రం ఉంటే బండిలాగించవచ్చు న్నట్లుగా ఈ చర్యను పరిగణించాలి. వర్తమాన ప్రపంచంలో యంత్రం నుంచి కాఫీ తీసుకోవాలన్నా, యుద్ధ విమానాలను నడపాలన్నా చిప్ కావాల్సిందే. గూగుల్ కృత్రిమ మేధ చెప్పిన సమాచారం ప్రకారం ప్రస్తుతం చైనా రోజుకు 140 కోట్ల చిప్స్ తయారు చేస్తున్నది. మోడీ ప్రకటించిన రాయితీలు అమల్లోకి వచ్చిన తరువాత మన ఉత్పత్తి రోజు 7.5నుంచి ఎనిమిది కోట్ల వరకు పెరుగుతుందట, అప్పటి వరకు చైనా చేతులు ముడుచుకు కూర్చుంటుందా? చిప్స్ తయారీలో ప్రస్తుతం చైనా తిరుగుబాటు ప్రాంతమైన తైవాన్ రాష్ట్రం, అమెరికా, మొత్తంగా ఐరోపా దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. వాటిని వెనక్కు నెట్టేందుకు చైనా ముందుచూపుతో వ్యవహరిస్తే తిరోగామి ఆలోచనలతో ఉన్న బీజేపీ, దాన్ని సమర్ధించే పార్టీలు దేశాన్ని ఎంత వెనక్కు నెట్టాయో అర్థం చేసుకోవచ్చు.

# వర్షాకాలంలో పిల్లల ఆరోగ్యం పట్ల జాగ్రత్త

## ఈ సూచనలు పాటిస్తే సురక్షితంగా ఉండవచ్చు



వర్షాకాలం పిల్లలకు ఎంతో ఇష్టమైన సీజన్ అయినప్పటికీ, ఇదే సమయంలో అనేక అంటువ్యాధుల ముప్పు కూడా పెరుగుతుంది. అధిక తేమ, నిల్వ నీరు, కలుషిత ఆహారం, కలుషిత తాగునీరు, ఎక్కువసేపు ఇంట్లో గడపడం వంటి కారణాల వల్ల వైరస్‌లు, బ్యాక్టీరియా, ఫంగస్‌లు, దోమలు వేగంగా వ్యాపిస్తాయి. ఫలితంగా వైరల్ జ్వరం, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్లు, డయేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, కళ్ల కలక (కంజంక్టివైటిస్), చర్మ వ్యాధులతో బాధపడే చిన్నారుల సంఖ్య వర్షాకాలంలో పెరుగుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పిల్లల్లో రోగనిరోధక శక్తి పూర్తిగా అభివృద్ధి చెందకపోవడం వల్ల వారు ఇలాంటి ఇన్‌ఫెక్షన్లకు త్వరగా గురవుతుంటారు. పాఠశాలలు, డే కేర్ కేంద్రాలు, ఆట వస్తువులు, బహిరంగ ప్రదేశాల ద్వారా సూక్ష్మక్రిములు సులభంగా వ్యాపిస్తాయి. అందువల్ల వ్యక్తిగత పరిశుభ్రత, సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, దోమల నియంత్రణ, వయస్సుకు తగిన టీకాలు వేయించుకోవడం ద్వారా చాలా వరకు వర్షాకాల వ్యాధులను నివారించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

**తేమ, నీరు నిల్వ లేకుండా చూడాలి..**

వర్షాకాలంలో వాతావరణంలో తేమ అధికంగా ఉండటంతో వైరస్‌లు, బ్యాక్టీరియా ఎక్కువసేపు జీవించే అవకాశం ఉంటుంది. కుండీలు, టైర్లు, బకెట్లు, నిర్మాణ ప్రదేశాలు వంటి చోట్ల నిలిచిపోయే నీటిలో దోమలు వేగంగా పెరిగి డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులను వ్యాప్తి చేస్తాయి. భారీ వర్షాల కారణంగా తాగునీరు కలుషితం కావడంతో డయేరియా, గ్యాస్ట్రో ఎంటరైటిస్, టైఫాయిడ్, హెపటైటిస్-ఎ వంటి వ్యాధుల ప్రమాదం పెరుగుతుంది. తడి దుస్తులు, తడి చెప్పులు ఎక్కువసేపు ధరించడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా అధికమవుతుంది. వర్షాకాలంలో పిల్లల్లో ఎక్కువగా కనిపించే వ్యాధుల్లో జలుబు, ఇన్‌ఫ్లుయెంజా వంటి శ్వాసకోశ వైరల్ ఇన్‌ఫెక్షన్లు ప్రధానమైనవి. జ్వరం, దగ్గు, గొంతు నొప్పి, ముక్కు కారడం, అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కలుషిత ఆహారం లేదా నీటి వల్ల డయేరియా, గ్యాస్ట్రో ఎంటరైటిస్, టైఫాయిడ్, హెపటైటిస్-ఎ వచ్చే ప్రమాదం ఉంటుంది. చిన్నారుల్లో డీహైడ్రేషన్ త్వరగా వచ్చే అవకాశం ఉండటంతో వెంటనే ద్రవాలు ఇవ్వడం అవసరం.

**దోమల నుంచి రక్షణ..**

డెంగ్యూ, చికున్‌గున్యా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు కూడా ఈ కాలంలో ఎక్కువగా కనిపిస్తాయి. అధిక జ్వరం, తీవ్రమైన ఒళ్లునొప్పులు, తలనొప్పి, చర్మంపై దద్దుర్లు, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు డెంగ్యూ తీవ్రరూపం దాల్చి ఆసుపత్రిలో చికిత్స అవసరమవుతుంది. తడి దుస్తులు, తడి చెప్పులు ఎక్కువసేపు ధరించడం వల్ల ఫంగల్ ఇన్‌ఫెక్షన్లు, అథ్లెట్స్ ఫుట్, చర్మ దద్దుర్లు, బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే పాఠశాలలకు వెళ్లే పిల్లల్లో కంజంక్టివైటిస్ కూడా సులభంగా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో పిల్లలను ఆరోగ్యంగా ఉంచేందుకు తరచూ చేతులను సబ్బుతో కడుక్కునే అలవాటు చేయాలి. ముఖ్యంగా భోజనం చేసే ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత, బయట ఆడుకుని వచ్చిన తర్వాత, దగ్గిన లేదా తుమ్మిన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి. ఇలా చేయడం ద్వారా డయేరియా, శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**తాగునీటి విషయంలో..**

పిల్లలకు ఎల్లప్పుడూ మరిగించి చల్లార్చిన లేదా ఫిల్టర్ చేసిన తాగునీరు మాత్రమే ఇవ్వాలి. నీటిని నిల్వ చేసే పాత్రలు శుభ్రంగా, మూతపెట్టి ఉంచాలి. డయేరియా వచ్చినప్పుడు డీహైడ్రేషన్ రాకుండా వెంటనే ఓఆర్ఎస్ ద్రావణం ఇవ్వాలి. వర్షాకాలంలో బయట లభించే ఆహారం, మూతలేని వీధి ఆహారం, ముందుగా కోసి ఉంచిన పండ్లు, ఎక్కువసేపు నిల్వ చేసిన ఆహారాన్ని పిల్లలకు ఇవ్వకపోవడం మంచిది. ఇంట్లో తాజాగా వండిన ఆహారం, బాగా కడిగిన పండ్లు, కూరగాయలే సురక్షితమైన ఎంపిక. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రతి వారం కూలర్లు, బకెట్లు, పూల కుండీలు, టైర్లు, టెర్రస్‌లను శుభ్రం చేయాలి. పిల్లలకు పూర్తి చేతుల దుస్తులు వేయించడం, దోమతెరలు లేదా పిల్లలకు అనువైన దోమల నివారణ లోషన్లు ఉపయోగించడం ద్వారా డెంగ్యూ వంటి వ్యాధులను నివారించవచ్చు. వర్షంలో తడిసిన వెంటనే పిల్లల దుస్తులు, చెప్పులు మార్చాలి. ముఖ్యంగా కాళ్ల వేళ్ల మధ్య భాగాన్ని పూర్తిగా తుడిచి పొడిగా ఉంచాలి. వర్షపు నీరు లేదా వరద నీటిలో చెప్పులు లేకుండా నడవకుండా జాగ్రత్త పడాలి.

**అన్ని టీకాలు తప్పనిసరి..**

పిల్లలకు వయస్సుకు అనుగుణంగా అన్ని టీకాలు తప్పనిసరిగా వేయించాలి. అవసరమైతే వైద్యుల సూచన మేరకు సీజనల్ ఫ్లూ వ్యాక్సిన్ కూడా వేయించుకోవచ్చు. ముఖ్యంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు ఉన్న పిల్లలకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. రోగనిరోధక శక్తిని మెరుగుపర్చేందుకు ఉసిరి, జామ, నారింజ వంటి విటమిన్-సి అధికంగా ఉండే పండ్లు, గుడ్లు, పప్పులు, పాలు, తక్కువ కొవ్వు ఉన్న మాంసాహారం, ఆకుకూరలు, నట్స్, విత్తనాలు, తగినంత నీరు ఆహారంలో భాగం చేయాలి. శిశువులకు తల్లిపాలు ఇవ్వడం కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు. తల్లిపాలల్లో ఉండే యాంటీబాడీలు చిన్నారులను అనేక ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. పిల్లలకు 48 నుంచి 72 గంటలకు మించి జ్వరం కొనసాగినా, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నిరంతర వాంతులు, తీవ్రమైన డయేరియా లేదా మలంలో రక్తం, మూత్రం తగ్గిపోవడం, డీహైడ్రేషన్ లక్షణాలు, అధిక నిద్రమత్తు, అయోమయం, జ్వరంతో పాటు దద్దుర్లు, చిగుళ్లు లేదా ముక్కు నుంచి రక్తస్రావం, తీవ్రమైన కడుపునొప్పి వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ముందే చికిత్సను ప్రారంభిస్తే..**

ముఖ్యంగా డెంగ్యూ వంటి వ్యాధుల్లో ముందస్తుగా చికిత్స ప్రారంభిస్తే తీవ్రమైన సమస్యలను నివారించే అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించడం ద్వారా పిల్లలను చాలా వరకు వైరల్, దోమల ద్వారా వ్యాపించే, నీటి ద్వారా సంక్రమించే, ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించవచ్చు. పరిశుభ్రత, సురక్షితమైన ఆహారం, స్వచ్ఛమైన తాగునీరు, దోమల నియంత్రణ, సమతుల ఆహారం, అవసరమైనప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం వంటి అలవాట్లను కుటుంబంలో భాగం చేస్తే పిల్లలు ఆరోగ్యంగా, సురక్షితంగా వర్షాకాలాన్ని ఆస్వాదించగలుగుతారు.

# జీఎల్‌పీ-1 ఔషధాలకు ఆదరణ తగ్గుతుందా

## నిపుణులు ఏం చెబుతున్నారు




స్థూలకాయం చికిత్సలో ఉపయోగించే జీఎల్‌పీ-1 ఔషధాల జెనరిక్ వెర్షన్లు భారత్‌లో తక్కువ ధరకు అందుబాటులోకి వచ్చినప్పటికీ, రోగులు చికిత్సను దీర్ఘకాలం కొనసాగించడంలో వెనుకబడుతున్నారని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. మందుల ధరలు తగ్గడం వల్ల అందుబాటు పెరిగినా, చికిత్సను మధ్యలోనే ఆపివేయడం ప్రధాన సవాలుగా మారిందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో సెమాగ్లుటైడ్ జెనరిక్ ఔషధాలు భారత మార్కెట్‌లోకి వచ్చిన తర్వాత బరువు తగ్గించే చికిత్సలో పెద్ద మార్పు వస్తుందని భావించారు. నెలకు వేల రూపాయలు ఖర్చయ్యే బ్రాండెడ్ మందులతో పోలిస్తే, జెనరిక్ మందులు సుమారు రూ.1వేయి నుంచి రూ.2,500 మధ్య లభించడం వల్ల మరింత మంది రోగులకు చికిత్స అందుబాటులోకి వచ్చింది. అయితే ప్రారంభంలో కనిపించిన డిమాండ్ తర్వాత విక్రయాల వేగం తగ్గినట్లు సమాచారం.

**అమ్మకాల అంచనాల్లో తగ్గుదల..**

తాజా మార్కెట్ అంచనాల ప్రకారం పలు ఔషధ తయారీ సంస్థలు జీఎల్‌పీ-1 జెనరిక్ మందుల అమ్మకాల అంచనాలను 25 నుంచి 30 శాతం వరకు తగ్గించాయి. దీనికి ప్రధాన కారణం కొత్త రోగులు లేకపోవడం కాదు. చికిత్స ప్రారంభించినవారిలో చాలామంది మందులు ఆలస్యంగా ప్రారంభించడం, కొద్ది రోజుల్లోనే ఆపేయడం లేదా అవసరమైన కాలం వరకు కొనసాగించకపోవడమేనని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఆరోగ్య నిపుణుల ప్రకారం స్థూలకాయం తాత్కాలిక సమస్య కాదు. ఇది దీర్ఘకాలం కొనసాగే వ్యాధి. రక్తపోటు లేదా మధుమేహం మాదిరిగానే దీన్ని కూడా నిరంతర చికిత్సతో నియంత్రించాల్సి ఉంటుంది. జీఎల్‌పీ-1 ఔషధాలు ఆకలిని తగ్గించడం, కడుపు ఖాళీ అయ్యే ప్రక్రియను నెమ్మదించడం, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడం ద్వారా బరువు తగ్గడంలో సహాయపడతాయి. అయితే ఈ ప్రయోజనాలు మందులు వాడుతున్నంత కాలమే కొనసాగుతాయి.

**మందులను నిలిపివేస్తే సమస్య మొదటికి..**

ప్రముఖ స్టెప్-1 అధ్యయనం ప్రకారం, సెమాగ్లుటైడ్ చికిత్స నిలిపివేసిన ఏడాది లోపే రోగులు తగ్గిన బరువులో దాదాపు మూడింట రెండు వంతులు తిరిగి పెరిగినట్లు గుర్తించారు. అలాగే గుండె ఆరోగ్యం, జీవక్రియకు సంబంధించిన అనేక ప్రయోజనాలు కూడా తగ్గిపోయినట్లు అధ్యయనం వెల్లడించింది. అందువల్ల చాలా మందికి దీర్ఘకాల చికిత్స అవసరమయ్యే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో ప్రధాన సమస్య మందుల ధర కాదని, చికిత్సను నిరంతరం కొనసాగించడమేనని నిపుణులు పేర్కొంటున్నారు. వారానికి ఒకసారి స్వయంగా ఇంజెక్షన్ తీసుకోవాల్సి రావడం, వికారం, వాంతులు వంటి జీర్ణకోశ దుష్ప్రభావాలు, తక్కువ సమయంలోనే ఎక్కువ బరువు తగ్గాలనే అవాస్తవ అంచనాలు, దీర్ఘకాలం మందులు వాడాల్సి రావడం, ధరలు తగ్గినా కొందరికి ఇంకా ఖరీదుగానే అనిపించడం, స్థూలకాయం చికిత్సలో అనుభవం ఉన్న వైద్యులు పరిమితంగా ఉండటం వంటి కారణాలు రోగులు చికిత్సను మధ్యలోనే ఆపడానికి దారి తీస్తున్నాయి.

**కొద్ది రోజులే వాడేవి కావు..**


జీఎల్‌పీ-1 మందులు యాంటీబయాటిక్స్‌లా కొద్దిరోజులు మాత్రమే వాడే మందులు కావు. చాలా మందికి వారానికి ఒకసారి ఇంజెక్షన్‌ను నిరవధికంగా తీసుకోవాలనే ఆలోచనే భయాన్ని కలిగిస్తుంది. మొదటి కొన్ని నెలల తర్వాత బరువు తగ్గడం నెమ్మదించడం కూడా రోగుల్లో నిరుత్సాహానికి కారణమవుతోంది. అయితే బరువు తగ్గడం స్థిరపడినప్పటికీ, ఈ మందులు శరీర జీవక్రియపై ఇతర ప్రయోజనాలను అందిస్తూనే ఉంటాయని నిపుణులు వివరిస్తున్నారు. భారత్‌లో స్థూలకాయం చికిత్సపై ఇప్పటికీ అపోహలు ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అధిక బరువును కేవలం ఆహార నియంత్రణ, వ్యాయామం, ఆత్మనిగ్రహంతోనే తగ్గించాలనే భావన చాలామందిలో ఉంది. దీంతో ఔషధ చికిత్స అవసరాన్ని కొందరు అంగీకరించడానికి ఇష్టపడటం లేదు. భారత వైద్యులు కూడా ఈ ఔషధాలను జాగ్రత్తగా సూచిస్తున్నారని నిపుణులు అంటున్నారు. జీఎల్‌పీ-1 మందులు వైద్యుల సూచనతో మాత్రమే వాడాల్సిన ప్రిస్క్రిప్షన్ ఔషధాలు. వీటికి కొన్ని దుష్ప్రభావాలు ఉండటంతో పాటు అందరికీ సరిపోవు. ప్రధానంగా స్థూలకాయం లేదా అధిక బరువుతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారికే వీటిని సూచిస్తారు. కేవలం అందంగా కనిపించడానికి బరువు తగ్గాలనే ఉద్దేశంతో ఈ మందులు వాడకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం..**

ఔషధాలతో పాటు సమతుల ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, జీవనశైలిలో మార్పులు, ప్రవర్తనా మార్పులపై కౌన్సెలింగ్ కూడా తప్పనిసరిగా ఉండాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇవన్నీ కలిపి పాటించినప్పుడే దీర్ఘకాలిక ఫలితాలు మెరుగ్గా ఉంటాయని చెబుతున్నారు. భవిష్యత్తులో ట్యాబ్లెట్ల రూపంలో లభించే జీఎల్‌పీ-1 ఔషధాలు పరిస్థితిని మార్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇంజెక్షన్ల కంటే ట్యాబ్లెట్లను ఎక్కువ మంది రోగులు సులభంగా స్వీకరించే అవకాశం ఉందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ప్రస్తుతం మధుమేహ చికిత్స కోసం నోటి ద్వారా తీసుకునే సెమాగ్లుటైడ్ అందుబాటులో ఉండగా, స్థూలకాయం చికిత్స కోసం కొత్త తరహా ట్యాబ్లెట్ల అభివృద్ధిపై ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు కొనసాగుతున్నాయి. జీఎల్‌పీ-1 ఔషధాలు కేవలం బరువు తగ్గించడానికే కాకుండా గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడం, రక్తంలో చక్కెర నియంత్రణను మెరుగుపరచడం, ఫ్యాటీ లివర్ వంటి స్థూలకాయంతో సంబంధం ఉన్న ఇతర సమస్యలను కూడా తగ్గించడంలో సహాయపడుతున్నాయని తాజా క్లినికల్ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. భారత్‌లో జీఎల్‌పీ-1 జెనరిక్ మందుల విక్రయాలు అంచనాల మేరకు పెరగకపోవడం వెనుక అసలు కారణం రోగుల కొరత కాదని, చికిత్సను నిరంతరం కొనసాగించేలా వారిని ప్రోత్సహించడం పెద్ద సవాలుగా మారిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ధరలు తగ్గడం వల్ల అందుబాటు పెరిగినా, ఇంజెక్షన్లపై భయం, దుష్ప్రభావాలు, అవాస్తవ అంచనాలు, దీర్ఘకాల చికిత్స అవసరం వంటి అంశాలను అధిగమించినప్పుడే ఈ చికిత్స పూర్తి ప్రయోజనం అందిస్తుందని వారు సూచిస్తున్నారు.

# పురుషుల ఆరోగ్యానికి పెద్ద ముప్పుగా మారుతున్న వ్యాధులు

## ఇవే జాగ్రత్తలు పాటించాల్సిందేనంటున్న వైద్యులు



దేశంలో పురుషుల ఆరోగ్యానికి అతిపెద్ద ముప్పుగా గుండె జబ్బులు, మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులు కారణమవున్నాయి. మారుతున్న జీవనశైలి, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పొగాకు వినియోగం, శారీరక శ్రమ లేకపోవడం, మానసిక ఒత్తిడి వంటి కారణాల వల్ల ఈ వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయితే జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా వీటిని చాలావరకు నివారించవచ్చని సూచిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా నమోదవుతున్న మరణాల్లో సుమారు 74 శాతం అంటువ్యాధులు కాని వ్యాధుల కారణంగానే సంభవిస్తున్నాయి. వీటిలో గుండె సంబంధిత వ్యాధులే అత్య ధికంగా ప్రాణాలు తీస్తున్నాయి. దేశంలో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గుండె జబ్బులతోపాటు మధుమేహం, నివారించగలి గే అనేక రకాల క్యాన్సర్ కేసులు ఆందోళ నకరంగా పెరుగుతున్నాయి

**మరణాలకు ప్రధాన కారణాలు ఇవే..**

ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం వంశపారంపర్య కారణాలు కొంతవరకు ప్రభావం చూపినా ధూమపానం, ఊబకాయం, అనారోగ్యకరమైన ఆహారం, అధిక మద్యం సేవించడం, వ్యాయామం చేయక పోవడం వంటి ప్రధాన ప్రమాద కారకాలను నియంత్రించడం ద్వారా వ్యాధి ముప్పును గణనీయంగా తగ్గించవచ్చు. దేశంలో పురుషుల మరణాలకు ప్రధాన కారణంగా గుండె సంబంధిత వ్యాధులు నిలుస్తున్నాయి. రక్తపోటు, కొలెస్ట్రాల్ పెరగడం, ఊబకాయం, ధూమపానం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక ఒత్తిడి వంటి అంశాలు గుండె ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయి. ఛాతిలో నొప్పి, ఊపిరి ఆడకపోవడం, అసాధారణ అలసట, తల తిరగడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి ప్రారంభ లక్షణాలను చాలామంది నిర్లక్ష్యం చేయడం వల్ల సమస్యలు మరింత తీవ్రమవుతున్నాయి.

**తరచూ పరీక్షలు అవసరం..**

గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించాలంటే క్రమం తప్పకుండా రక్తపోటు, కొలెస్ట్రాల్ పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడం, వారానికి కనీసం 150 నిమిషాల పాటు మోస్తరు స్థాయి వ్యాయామం చేయడం, పొగాకు ఉత్పత్తులను పూర్తిగా మానేయడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచంలో అత్యధిక మధుమేహ రోగులు ఉన్న దేశాల్లో భారత్ ఒకటి. ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ డయాబెటిస్ అట్లాస్ 2025 ప్రకారం దేశంలో 10 కోట్లకు పైగా పెద్దలు మధుమేహంతో జీవిస్తున్నారు. మరోవైపు లక్షలాది మంది ప్రీ-డయాబెటిస్ దశలో ఉండటం వల్ల భవిష్యత్తులో వారికి మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంది. అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ప్రాసెస్డ్ ఫుడ్స్ అధికంగా తినడం, శారీరక శ్రమ లేకపోవడం, వంశపారంపర్య కారణాలు మధుమేహం పెరగడానికి ప్రధాన కారణాలుగా నిపుణులు పేర్కొంటున్నారు. నియంత్రణలో లేని మధుమేహం గుండె జబ్బులు, స్ట్రోక్, మూత్రపిండాల వ్యాధులు, కంటి చూపు కోల్పోవడం, నరాలు దెబ్బతినడం, పాదాల్లో పుండ్లు వంటి తీవ్రమైన సమస్యలకు దారితీస్తుంది.

# పెసర బెల్లం కుడుములు



**కావలసిన పదార్థాలు**

పెసర్లు ఒక కప్పు, బియ్యపు పిండి: ఒక కప్పు, బెల్లం ఒక కప్పు, పచ్చికొబ్బరి తురుము అరకప్పు, యాలకుల పొడి అర టీస్పూన్, నెయ్యి: ఒక టేబుల్ స్పూన్, ఉప్పు చిటికెడు.

**తయారీ విధానం**

పెసర్లను దోరగా వేయించుకోవాలి. కుక్కర్‌లో మూడున్నర కప్పుల నీళ్లుపోసి నాలుగు విజిల్స్ వచ్చేవరకు వాటిని ఉడికించుకోవాలి. ప్రెషర్ తీసిన తర్వాత సన్నని మంటపై పెట్టి కొబ్బరి తురుము, బెల్లం తురుము, ఒక టేబుల్ స్పూన్ నెయ్యి, యాలకుల పొడి వేసి పప్పు గుత్తితో మెత్తగా మెదిపి దగ్గరపడ్డాక దించి చల్లార్చాలి. ఒక గిన్నెలో బియ్యపు పిండి, ఉప్పు వేసి తగినన్ని నీళ్లుపోసి జారుగా కలిపి స్టవ్‌మీద పెట్టి ముద్ద అయ్యేవరకూ కలుపుతూ ఉడికించాలి. పిండి మిశ్రమాన్ని ముద్దలా బాగా కలిపి కొద్దికొద్దిగా తీసుకుని చిన్నపాటి పూరీల్లా ఒత్తి, మధ్యలో పెసర మిశ్రమం పెట్టి కజ్జికాయల్లా మడవాలి.

వాటిని ఆవిరిపాత్రలో పావుగంటపాటు ఉడికించుకుంటే వేడివేడి పెసర బెల్లం కుడుములు సిద్ధం.

# పిల్లల మెదడు అభివృద్ధికి దోహదపడే బ్లూబెర్రీలు

## రోజూ ఇస్తే ఎన్నో ఉపయోగాలు

బ్లూబెర్రీలు ఆరోగ్యానికి మేలు చేసే పండ్లలో ఒకటిగా ఇప్పటికే గుర్తింపు పొందాయి. తాజాగా వెలువడిన ఒక అధ్యయనం ప్రకారం, ఈ పండ్లలో ఉండే సహజ సమ్మేళనాలు పిల్లల్లో మెదడు అభివృద్ధి, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, భావోద్వేగ నియంత్రణకు తోడ్పడే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. అయితే ఈ ప్రయోజనాలను పూర్తిగా నిర్ధారించేందుకు మరిన్ని దీర్ఘకాలిక అధ్యయనాలు అవసరమని వారు స్పష్టం చేస్తున్నారు. బాల్యం అంటే మెదడు వేగంగా అభివృద్ధి చెందే కీలక దశ. ఈ సమయంలో నేర్చుకునే సామర్థ్యం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, భావోద్వేగాలు, సామాజిక ప్రవర్తన వంటి అంశాలు రూపుదిద్దుకుంటాయి. ప్రస్తుతం పిల్లల్లో ఆందోళన, నిరాశ, ఏకాగ్రత లోపం వంటి సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఆహారం ద్వారా మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచే మార్గాలపై శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు.

**మెదడు కణాలకు రక్షణ..**

బ్లూబెర్రీల్లో ఆంథోసయనిన్స్, ఫ్లావోనాల్స్, ఫీనాలిక్ యాసిడ్స్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉండటంతో మెదడు కణాలను దెబ్బతినకుండా కాపాడడంలో సహాయపడతాయి. ముఖ్యంగా ఆంథోసయనిన్స్ రక్త-మెదడు అవరోధాన్ని దాటి నేరుగా మెదడుపై ప్రభావం చూపగలవని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇవి మెదడు కణాల మధ్య సమాచార మార్పిడిని మెరుగుపరచి జ్ఞాపకశక్తి, అభ్యాస సామర్థ్యానికి మద్దతు ఇస్తాయి. అధ్యయనంలో పాల్గొన్న కొన్ని పరిశోధనల్లో బ్లూబెర్రీలు తీసుకున్న పిల్లలు జ్ఞాపకశక్తి పరీక్షల్లో, ముఖ్యంగా పదాలను గుర్తుంచుకోవడం, కనిపించినట్లు నివేదించారు.

# సృష్టిలో తీయనిది

శాండిల్య ఆలోచిస్తున్నాడు. రిటైర్మెంట్‌కు ఇంకా పదేళ్ల పైనే ఉంది. ఇప్పటికే బాగా స్థిరపడి ఉండాల్సింది. కానీ, ఆ దిశగా పొదుపు చర్యలేవీ చేపట్టలేదు. అది తలుచుకుని కొద్దిగా చింతించాడు. అతను చేసిందల్లా అప్పుడప్పుడూ వచ్చిన బోనస్, డీఏ బకాయిలు, పే కమిషన్ వల్ల జీతం పెరిగినప్పుడు మొత్తంగా వచ్చిన డబ్బు ఇలాంటివన్నీ కలిపి సుమారుగా ఐదు లక్షల వరకూ ఫిక్స్‌డ్ డిపాజిట్ వేసి ఉంచాడు. అంతకుమించి మరేవిధమైనా పొదుపు చర్యలు చేపట్టలేదు. ఇళ్ల స్థలాలు కొనలేదు. బంగారం అసలే కొనలేదు. ప్రస్తుతం అతనుండే ఇల్లు మాత్రమే చెప్పుకోదగ్గ స్థిరాస్తి. అది కూడా పదేళ్ల క్రితం కొన్నది. ఇప్పటికీ దానికి నెలనెలా ఈఎంఐ కడుతూనే ఉన్నాడు. ఇరవై ఏళ్ల వ్యవధి.. అంటే రిటైర్మెంట్ వరకూ కడుతూనే ఉండాలి. ఏదో విధంగా దాని వ్యవధి తగ్గించుకుని అప్పనేది లేకుండా ఉండాలనుకుంటే కుదిరేట్టు లేదు. ఈసారి ఎలాగైనా ఈఎంఐ పెంచి వచ్చే ఐదేళ్లల్లో లోన్ మొత్తం తీర్చేయ్యాలి. ఉద్యోగం ఉండగానే అప్పు తీర్చేసి నిశ్చింతగా ఉండాలి. మదినిండా లెక్కలేనన్ని ఆలోచనలతో సతమతమవుతూ ఆఫీసుకు బయలుదేరాడు శాండిల్య. ఆఫీసుకు చేరుకోగానే ఎదురు పడ్డాడు సహోద్యోగి వాసుదేవన్. పక్కసీట్లోనే కూర్చుంటాడు. శాండిల్య ప్లానింగ్ వర్క్ చూస్తే వాసు టెండర్ల పని చూస్తుంటాడు. అతనికి స్టాక్ మార్కెట్ పిచ్చి కాస్త ఎక్కువే. అలాగని తాహతుకు మించి పెట్టుబడులు పెట్ట లేదు. అలాగని విపణిలో మరీ లెక్కలేనన్ని లాభాలు కూడా కళ్లజూడలేదు. మధ్యేమార్గంగా అతని పెట్టుబడుల కార్యక్రమం జరుగుతూ ఉంది. అతన్ని మందలించేవాడు.

# ఐటీ బ్యాంకింగ్ జోష్ భారీ లాభాలతో
## ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు




గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఎదురైనప్పటికీ, దేశీయ ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆటో రంగాల షేర్లలో వచ్చిన భారీ కొనుగోళ్ల మద్దతుతో ఇవాళ (శుక్రవారం) ఫ్లాట్ ట్రెండ్‌ను పక్కనబెట్టి దలాల్ స్ట్రీట్ అద్భుతమైన ర్యాలీని సాధించింది. సెన్సెక్స్ ఏకంగా 960 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ కీలకమైన 24,300 మార్కును దాటి ముగిసింది. ఉదయం 77,370.77 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా కొనుగోళ్ల జోరుతో గరిష్ఠంగా 78,282.55 పాయింట్ల స్థాయిని తాకింది. చివరికి.. క్రితం ముగింపు 77,186.87తో పోలిస్తే 964.59 పాయింట్లు (1.25శాతం) లాభపడి 78,151.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 24,127.60 వద్ద గ్రీన్ మార్క్‌తో ట్రేడింగ్‌ను ఆరంభించి, ఇంట్రాడేలో 24,367.30 గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతిమంగా 261.55 పాయింట్లు (1.09శాతం) ఎగబాకి 24,334.30 వద్ద క్లోజ్ అయింది.

**ఐటీ, బ్యాంకింగ్ షేర్ల అండ**

జూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కావడం మార్కెట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా అంచనాలకు మించి లాభాలను ప్రకటించడంతో ఐటీ రంగం పరుగులు పెట్టింది. దీనికి తోడు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి లార్జ్ క్యాప్ ఐటీ షేర్లు నిఫ్టీ ర్యాలీని ముందుండి నడిపించాయి. ప్రైవేట్ బ్యాంకింగ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి హెవీవెయిట్ స్టాక్స్ కూడా మార్కెట్ బుల్లిష్ ట్రెండ్‌కు బలమైన మద్దతునిచ్చాయి.

**గ్లోబల్ ఒత్తిడిని అధిగమించిన వైనం**

ఆసియా మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ మన మార్కెట్లు సొంత బలంతో రాణించాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వ్యాఖ్యల నేపథ్యంలో అంతర్జాతీయంగా సెంటిమెంట్ కాస్త బలహీనంగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే మొగ్గు చూపారు.

**వెనుకబడిన బ్రాడర్ మార్కెట్స్**

ప్రధాన సూచీలు దాదాపు ఒక శాతానికి పైగా లాభాల్లో దూసుకుపోయినప్పటికీ.. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్స్ మాత్రం ఇవాళ నిరాశ పరిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.41శాతం, 0.21శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. మార్కెట్ కొనుగోళ్లు కేవలం లార్జ్ క్యాప్ హెవీ వెయిట్స్ కే పరిమితం కావడమే ఇందుకు కారణం. ఈ వారాంతపు ట్రేడింగ్ సెషన్ క్లోజింగ్ మార్కెట్ బలాన్ని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా నిఫ్టీ 24,100 దిగువన బలమైన సపోర్ట్ తీసుకుని సరికొత్త రికార్డుల దిశగా పుంజుకోవడం ఇన్వెస్టర్లకు సానుకూల అంశం. వచ్చే వారం వెలువడనున్న ప్రధాన కార్పొరేట్ కంపెనీల ఫలితాలు, బడ్జెట్ అంచనాలు మార్కెట్ తదుపరి దిశను నిర్దేశించనున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# కేవలం రూ.7500 కడితే రూ.1 లక్ష ఇస్తామని
## లెటర్ క్లారిటీ ఇచ్చిన కేంద్రం




కేవలం రూ.7500 కడితే బ్యాంక్ ఖాతాలోకి రూ.1 లక్ష వస్తాయి అంటే చాలా మంది ఆకర్షితులవుతారు. అందులోనూ కరెన్సీ నోట్లను ముద్రించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి సంస్థ నుంచి ఇలాంటి ప్రకటన వస్తే ఇంకేమైనా ఉందా జనాలు ఎగబడతారు. తాజాగా అలాంటి ఓ ప్రకటనే సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కేవలం రూ.7500 ట్యాక్స్ చెల్లించినట్లయితే రీఫండ్ ద్వారా బ్యాంక్ ఖాతాలో రూ.1,00,000 మేర జమ చేస్తామని రిజర్వ్ బ్యాంక్ పేరుతో ఓ లేఖ ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. దీంతో చాలా మంది దీనిపై ఆరా తీస్తున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం. రూ.7500 కడితే లక్ష ఇస్తామంటూ ఆర్‌బీఐ పేరుతో చక్కర్లు కొడుతున్న లేఖ ఫేక్ అని, రీఫండబుల్ ట్యాక్స్ పేరుతో సోషల్ మీడియాలో వస్తున్న ఇలాంటి వార్తలను నమ్మొద్దని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. 'రూ.7,500 రీఫండబుల్ ట్యాక్స్ కడితే ఆర్‌బీఐ రూ.1 లక్ష విడుదల చేస్తుందంటూ సోషల్ మీడియాలో తాజాగా ఓ లేఖ విస్తృతంగా ప్రచారం అవుతోంది. ఈ లేఖతో ఆర్‌బీఐకి గానీ, ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధం లేదు. ఇలాంటి సందేశాలు, లేఖలకు స్పందించి ఎలాంటి చెల్లింపులూ చేయవద్దు' అని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ హెచ్చరిస్తూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ చేసింది. ముందస్తు చెల్లింపులు, ట్యాక్సులు లేదా ప్రాసెసింగ్ ఫీజులకు బదులుగా నగదు ఇస్తామని ఆర్‌బీఐ ఎప్పుడూ ప్రకటనలు చేయదని స్పష్టం చేసింది. ప్రజలను నమ్మించి బోల్తా కొట్టించేందుకు సైబర్ నేరగాళ్లు ప్రభుత్వ రంగ సంస్థల పేర్లు, లోగోలను వినియోగించి తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నట్లు పీఐబీ ఫ్యాక్ట్ చెక్ పేర్కొంది. ఇటువంటి ప్రచారాలపై స్పందించే ముందు అధికారిక వెబ్‌సైట్ల ద్వారా ధ్రువీకరించుకోవాలని కోరింది. ఎవరైనా ఇలాంటి వాటిని నమ్మి మోసపోయినట్లయితే వెంటనే స్థానిక అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపింది. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ఏదైనా తప్పుడు సమాచారాన్ని గుర్తించినట్లయితే పీఐబీ ఫ్యాక్ట్ చెక్‌కు రిపోర్ట్ చేయాలని సూచించింది.

# షేర్లు కొనడానికి 30 సెకన్లు చాలు కానీ ఎప్పుడు అమ్మాలో
## తెలవడమే అసలు నైపుణ్యం ఎవరూ చెప్పని టిప్స్ మీకోసం




స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెడుతున్న వారు అందరూ ఏ షేరు కొనాలి, ఏ మల్టీబ్యాగర్ స్టాక్ ఎంచుకోవాలి అనే విషయంపైనే ఎక్కువగా రీసెర్చ్ చేస్తారు. కానీ, కొన్న షేరును ఎప్పుడు అమ్మాలో చాలా మందికి తెలియదు. నిజానికి స్టాక్ మార్కెట్లో షేర్లు కొనడానికి కేవలం 30 సెకన్లు సరిపోతుంది. కానీ, కొన్న స్టాక్‌ను సరైన సమయానికి అమ్మేయడమే అసలైన కళ అని మార్కెట్ నిపుణులు చెబుతుంటారు. చాలా మంది ఇన్వెస్టర్లు తాము కొన్న స్టాక్స్ ను కేవలం రెండు కారణాల వల్లే అమ్ముతారు. అందులో ఒకటి భయం, రెండు సహనం కోల్పోవడం. కానీ, అంతకు మించిన అంశాలు ఉంటాయి.

**ఇన్వెస్టర్లు చేసే పొరపాట్లు ఇవే**

ఒక స్టాక్ ధర కొద్దిగా పడగానే భయపడిపోయి అమ్మేస్తుంటారు. లేదా ఒక మంచి షేరు కొన్న తర్వాత ఏడాది పాటు అది ఎక్కడికీ కదలకుండా ఒకే రేంజ్‌లో ఉంటే బోర్ కొట్టి సహనం కోల్పోయి విక్రయిస్తుంటారు. నిజానికి ఇవి మార్కెట్ నియమాలు కావు. కేవలం మన మానసిక పరిస్థితికి సంబంధించిన అంశాలు మాత్రమే. ఒక బిజినెస్ విలువ ఏంటో మీకు పక్కాగా తెలిస్తే ఆ షేరును ఎప్పుడు ఉంచుకోవాలి, ఎప్పుడు వదిలించుకోవాలి అనేది స్పష్టంగా అర్థమవుతుంది.

**ఎవరూ చెప్పని కొన్ని టిప్స్..**

మంచి కంపెనీలను గుర్తించడం: ఒక కంపెనీని మార్కెట్లో తిరుగులేని శక్తిగా మార్చే అంశాలు ఏంటిలాంగ్ టర్మ్‌లో నిలబడే పోటీతత్వ ప్రయోజనాలు ఉన్న కంపెనీలను ఎలా కనిపెట్టాలో తెలుసుకోవాలి. పోటీదారులను తట్టుకునే శక్తి ఉన్న కంపెనీలను ఎంచుకోగలిగితే దీర్ఘకాలంలో షేరు మంచి పనితీరు కనబరిచే అవకాశం ఉంటుంది. బ్రాండ్ వాల్యూ, మోనోపలీ, ఎప్పటికీ చెరిగిపోని ప్రత్యేకత ఉన్న కంపెనీలను ఎంచుకోవడం ముఖ్యం.

**స్టాక్-పికింగ్ చెక్‌లిస్ట్:** చాలా మంది ఐటీ స్టాక్స్ కొనేందుకు ఒకలాంటి రీసెర్చ్, బ్యాంకింగ్ లేదా ఫార్మా స్టాక్స్ కోసం మరోలాంటి రీసెర్చ్ చేస్తూ గందరగోళపడతారు. ఏ రంగానికి చెందిన కంపెనీకైనా, ఏ కాలంలోనైనా సరిపోయే ఒక పక్కా ఫ్రేమ్‌వర్క్ రూపొందించుకోవాలి. దీంతో మీరు ఒక కొత్త స్టాక్ చూడగానే ఈ చెక్‌లిస్టులోని రూల్స్ అప్లై చేసి అది మీ పోర్ట్‌ఫోలియోకు సెట్ అవుతుందా లేదా అని కేవలం కొన్ని నిమిషాల్లోనే సొంతంగా తేల్చుకోగలుగుతారు. దీంతో ఎవరి రికమండేషన్లపైనా ఆధార పడాల్సిన అవసరం ఉండదు.

**ఆర్థిక ఆరోగ్యాన్ని సూచించే నంబర్:** కంపెనీలు తమ వార్షిక నివేదికల్లో వేల కోట్ల ఆదాయం చూపిస్తూ భారీగా లాభాలు వచ్చాయని కలరింగ్ ఇస్తాయి. కానీ లోపల చూస్తే అప్పుల ఊబిలో ఉంటాయి. బ్యాలెన్స్ షీట్లలో ఉండే మాయాజాలాన్ని పక్కనబెట్టి కంపెనీ నిజంగా బలంగా ఉందో లేదో మ్యాజిక్ నంబర్ గురించి తెలుసుకోవాలి.

**ఫెయిర్ వాల్యూ నిర్ధారణ:** ఒక కంపెనీ ఎంత అద్భుతమైనదైనా సరే దాని షేరు ధర విపరీతంగా పెరిగిపోయి ఉన్నప్పుడు కొంటే మీకు లాభాలు రావు సరికదా నష్టపోయే ఛాన్స్ ఉంటుంది. ఒక స్టాక్ ధర ప్రస్తుతం ఉన్న మార్కెట్ రేటు ప్రకారం చౌకగా ఉందా, కరెక్ట్ రేటు లోతెలుసుకోగలగాలి.

# ఫెడ్ వడ్డీ రేట్ల పెంపు భయాలు మళ్లీ తగ్గిన బంగారం ధర
## ఏ జువెల్లరీల్లో గ్రాము గోల్డ్ రేటు ఎంతంటే




భారతదేశంలో బంగారానికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. మహిళలు ఎక్కువగా బంగారు ఆభరణాల్ని పండగలు, వివాహాలు, ఇతర వేడుకల వేళ కొనుగోలు చేసి ధరించేందుకు చూస్తుంటారు. గతేడాది భారీగా ధరలు పెరగ్గా డిమాండ్ కాస్త తగ్గింది. అయితే ఈ ఏడాది మళ్లీ పశ్చిమాసియా ఉద్రిక్తతలు సహా కేంద్రం ఆంక్షల కారణంగా ధరలు తగ్గుతూ వస్తున్నాయి. శుక్రవారం రోజు కూడా బంగారం ధర తగ్గింది. ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లలో బంగారం ధరలు వేగంగా మారుతున్నందున దానికి తగ్గట్లుగా దేశీయంగా కూడా బంగారం ధరలు తంచుగా మారుతున్నాయి. ఈ క్రమంలో జులై 17న కూడా గోల్డ్ రేట్లు మళ్లీ ఇంట్రాడేలో మారాయి. ప్రస్తుతం దేశంలోని ఏ జువెల్లరీల్లో బంగారం ధర గ్రాముకు ఇప్పుడు ఎంత ఉందో తెలుసుకుందాం.

ఇంటర్నేషనల్ మార్కెట్లో చూస్తే గోల్డ్, సిల్వర్ రేట్లు మళ్లీ దిగొస్తున్నాయి. స్పాట్ గోల్డ్ రేటు కిందటి రోజు ఔన్సుకు 4 వేల డాలర్లపైన ఉండగా ఇప్పుడు అది 3985 డాలర్లకు పడిపోయింది. సిల్వర్ రేటు 55.70 డాలర్ల వద్ద ఉంది. మరోవైపు రూపాయి విలువ రూ. 96.30 వద్ద ఉంది. ఒకవైపు పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో క్రూడాయిల్ ధర లు పెరుగుతుండటం వల్ల కూడా బంగారం ధరలు తగ్గుతున్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ ధర ఇటీవల బ్యారెల్‌కు 70 డాలర్ల స్థాయికి చేరినా మళ్లీ పెరిగి ఇప్పుడు 85 డాలర్ల స్థాయిలో ఉంది. దీంతో బంగారం ధర తగ్గుతుంది. మరో ప్రధాన కారణం యుద్ధం నేపథ్యంలో అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతుండగా యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను పెంచే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే డాలర్, బాండ్లకు డిమాండ్ పెరిగి బంగారం ధర తగ్గుతూ వస్తోంది. దీంతో వాటికి అనుగుణంగా దేశీయంగాకూడాధరలు అవుతున్నాయి

# అంబానీ కంపెనీకి కళ్లుచెదిరే లాభాలు 150 శాతం జంప్
## ఒక్కసారిగా దూసుకెళ్లిన షేర్ ధర




భారత స్టాక్ మార్కెట్లు అదరగొడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నా భారత సూచీలు దూసుకెళ్తూనే ఉన్నాయి. శుక్రవారం సెషన్‌లోనూ సూచీలు జోరు మీదనే ఉన్నాయి. ఆరంభం నుంచి లాభాల్లోనే ట్రేడవుతున్నాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు 700-800 పాయింట్ల వరకు లాభంలో ట్రేడయిన సెన్సెక్స్ ఇప్పుడు 2.20 గంటల సమయంలో 1000 పాయింటకుపైగా పెరిగి 78150 మార్కుపైన ఉంది. నిఫ్టీ చూస్తే 250 పాయింట్లకుపైగా పెరిగి 24300 మార్కుపైన కొనసాగుతోంది. అయితే ఇక్కడ పలు హెవీ వెయిట్ స్టాక్స్ రాణిస్తున్నాయి. ఐటీ స్టాక్స్ పరుగులు పెడుతున్నాయి. టెక్ మహీంద్రా 4 శాతానికిపైగా పెరగ్గా, టీసీఎస్ 3 శాతానికిపైగా పుంజుకుంది. ఇతర ఐటీ స్టాక్స్ కూడా రాణిస్తున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు 2 శాతానికిపైగా పెరిగింది. ఎస్బీఐ దాదాపు 2 శాతం పుంజుకుంది. ఈ క్రమంలోనే మనం దిగ్గజ పారిశ్రామిక వేత్త ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు ఇంట్రాడేలో 6 శాతానికిపైగా పెరిగింది. కిందటి రోజు రూ. 235.65 వద్ద ముగియగా ఇవాళ నేరుగా 5 శాతానికిపైగా లాభంతో రూ. 247.50 వద్ద ఓపెన్ అయింది. ఇంట్రాడేలో 6 శాతానికిపైగా ఎగబాకి రూ. 249.95 వద్ద సెషన్ గరిష్ఠాన్ని తాకింది. ప్రస్తుతం 4 శాతం లాభంతో రూ. 244 స్థాయిలో ఉంది. దీంతో ఇన్వెస్టర్లకు మంచి లాభాలు వచ్చాయి. ఈ కంపెనీ మార్కెట్ విలువ ప్రస్తుతం రూ. 1.55 లక్షల కోట్లుగా ఉంది. స్టాక్ 52 వారాల గరిష్ఠ, కనిష్ఠ ధరలు వరుసగా రూ. 338.60, రూ. 223.30 గా ఉన్నాయి. గత 6 నెలల వ్యవధిలో ఈ స్టాక్ 12 శాతం పడిపోగా, ఏడాదిలో 24 శాతం వరకు తగ్గింది. అయితే ఇవాళ ఒక్కసారిగా పెరిగేందుకు కారణం ఉంది. సంస్థ కిందటి రోజు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ - జూన్ ఫలితాల్నివిడుదలచేసింది.

# విప్రో లాభం రూ.3,352 కోట్లు




**న్యూఢిల్లీ:** ఐటీ దిగ్గజం విప్రో లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)లో ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి (క్యూ1) రూ.3,352 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో కంపెనీ రూ.3,330.4 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. నికర లాభంలో స్వల్ప వృద్ధి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ1లో కంపెనీ కార్యకలాపాల ద్వారా రాబడి గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో (రూ.22,134.6 కోట్లు) పోల్చితే 10.6 శాతం వృద్ధి చెంది రూ.24,478.6 కోట్లకు చేరుకుంది. త్రైమాసిక ప్రాతిపదికన లాభం 4.2శాతం తగ్గగా.. రాబడి మాత్రం 1 శాతం మేర పెరిగింది. సమీక్షా త్రైమాసికంలో ఐటీ సర్వీసుల విభాగం నుంచి రాబడి 2,614.5 మిలియన్ డాలర్లుగా ఉంది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇందులో వృద్ధి 1 శాతం ఉండగా.. త్రైమాసికం ప్రాతిపదికన 1.4 శాతం తక్కువగా ఉంది. జూలై-సెప్టెంబర్ త్రైమాసికానికి (క్యూ2) ఐటీ సర్వీసుల వ్యాపార ఆదాయం 257.4 కోట్ల డాలర్ల నుంచి 262.7 కోట్ల డాలర్ల మధ్య ఉంటుందని విప్రో అంచనా వేస్తోంది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో మొత్తం బుకింగ్స్ 3,370 మిలియన్ డాలర్లుగా ఉంది. భారీ డీల్ బుకింగ్స్ 1,626 మిలియన్ డాలర్లకు చేరాయి. మొదటి త్రైమాసికంలో ఐటీ సర్వీసుల ఆపరేటింగ్ మార్జిన్ 16 శాతానికి క్షీణించింది. మార్చి 1 నుంచి అమల్లోకి వచ్చిన వేతన పెంపుదల ప్రభావం, ఏఐ రంగంలో కొనసాగుతున్న పెట్టుబడుల కారణంగా ఈ 1.2 శాతం వార్షిక క్షీణత నమోదైందని విప్రో సీఎ?ఫఓ అపర్ణ అయ్యర్ చెప్పారు. కాగా, కంపెనీ బోర్డు ఒక్కో షేరుకు రూ.2 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది.

**సరిపోయేంతగా ఫ్రెషర్లు.. :** ఈ జూన్ చివరినాటికి కంపెనీలో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,43,044గా ఉంది. మొదటి త్రైమాసికంలో ఫ్రెషర్లను నియమించుకోలేదని విప్రో యాజమాన్యం పేర్కొంది. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫ్రెషర్ల నియామక టార్గెట్‌ను కూడా సంస్థ వెల్లడించలేదు. తమ వద్ద సరిపోయేంతగా ఫ్రెషర్లు ఉన్నారని, గత ఏడాదిలో దాదాపు 7,500 మందిని నియమించుకున్నామని చీఫ్ హ్యూమన్ రీసోర్సెస్ ఆఫీసర్ సౌరభ్ గోవిల్ తెలిపారు. అనిశ్చితులతో నిర్ణయాలపై ప్రభావం: స్థూల ఆర్థిక వాతావరణం పటిష్ఠంగానే ఉన్నప్పటికీ అనిశ్చితులు తమ క్లయింట్ల నిర్ణయాలపై ప్రభావం చూపుతున్నాయని విప్రో సీఈఓ, ఎండీ శ్రీని పల్లియా పేర్కొన్నారు. టెక్నాలజీ పెట్టుబడులు మందగించలేదని, అవి మరింత నిర్దిష్టంగా మారాయని తెలిపారు. పరిస్థితులు మారుతున్న కొద్దీ క్లయింట్లు పెట్టుబడులపై ఫలితాలను మరింత కఠినంగా పరిశీలిస్తున్నారన్నారు. క్లయింట్లు ఎంపిక చేసిన వాటికే ఖర్చు చేస్తున్నప్పటికీ కంపెనీకి ఆర్డర్ల లభ్యత మెరుగ్గానే ఉందన్నారు. క్లయింట్లు నాణ్యత, స్థిరత్వం, ఉత్పాదకతను మెరుగుపరిచే కృత్రిమ మేధ ఆధారిత ఆపరేటింగ్ మోడళ్లవైపు అడుగులు వేస్తున్నారని పేర్కొన్నారు.

# టెక్ మహీంద్రా లాభంలో 28.4 శాతం వృద్ధి




**న్యూఢిల్లీ:** ఐటీ సర్వీసుల కంపెనీ టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27) జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) రూ.1,465 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆర్జించిన నికర లాభంతో పోల్చితే వృద్ధి 28.4 శాతంగా ఉంది. జూన్ త్రైమాసికంలో కార్యకలాపాల ద్వారా రాబడి 17.7 శాతం పెరిగి దాదాపు రూ.15,712 కోట్లకు చేరుకుంది. డాలర్ పరంగా చూస్తే.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రాబడి 1,660 మిలియన్ డాలర్లుగా ఉంది. ఇది త్రైమాసిక ప్రాతిపదికన 2.2 శాతం ఎక్కువ కాగా వార్షిక ప్రాతిపదికన 6.1 శాతం అధికం. తొలి త్రైమాసికంలో కంపెనీ మెరుగైన ఫలితాలను సాధించిందని, పరిశ్రమలోనే అధిక వృద్ధిని నమోదు చేసిందని కంపెనీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ మోహిత్ జోషి పేర్కొన్నారు. కంపెనీపరంగా చూస్తే డిమాండ్ పరిస్థితులు సానుకూలంగా ఉన్నాయన్నారు. సామర్థ్యాల అభివృద్ధి, ప్రతిభావంతులైన ఉద్యోగుల నియామకం, కొత్త క్లయింట్లను సంపాదించుకోవడం, కన్సాలిడేషన్ డీల్స్‌ను సొంతం చేసుకోవడం వంటి వాటి కోసం చేసిన కృషి ఫలితాన్నిచ్చిందని తెలిపారు. ఇటీవలికాలంలో తమ కంపెనీ వృద్ధి తోటి సంస్థల సగటును అధిగమించడం ప్రారంభించిందన్నారు. 50 మిలియన్ డాలర్లకు మించిన వ్యాపారం అందించే క్లయింట్ల సంఖ్య ఏడు మేర పెరిగిందని తెలిపారు. ఆదాయాల ప్రారంభమవుతుందని భావిస్తున్నట్టు జోషి తెలిపారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు


**- జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులకు స్పష్టం చేసిన మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**



**హైదరాబాద్, :** మల్కాజ్గిరి మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ప్రతి జర్నలిస్టుకు మీడియా అక్రిడిటేషన్ కార్డు అందజేస్తామని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే - ఐజేయు) రాష్ట్ర కోశాధికారి మోతే వెంకటరెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గడ్డమీది బాలరాజు, దొంతుల వెంకట్రాం రెడ్డిలతో పాటు జిల్లా అక్రిడేషన్ కమిటీ ప్రతినిధులు శుక్రవారం జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జిల్లా పరిధిలో జర్నలిస్టులుగా పని చేస్తున్న సీనియర్ రిపోర్టర్లందరికీ అక్రిడేషన్ కార్డులు అందేలా చూసామని హామీ ఇచ్చారు. అంతకుముందు జిల్లా టియుడబ్ల్యూజే ప్రతినిధులు మాట్లాడుతూ నిబంధనలు పేరుతో కొంతమందికి ఇబ్బంది కలిగించకుండా అందరికీ కార్డులు అందించే విధంగా చూడాలని కోరారు. అక్రిడేషన్ కార్డుల జారీలో జాప్యం చేయకుండా, అందరికీ అందజేయాలని, దీనికి అక్రిడేషన్ కమిటీ సహకారం అందజేస్తుందని తెలిపారు. కమిటీ ప్రతినిధుల వినతి మేరకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలోనే జర్నలిస్టులందరికీ న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ సభ్యుడు మల్కయ్య, జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రవిచంద్ర, అక్రిడేషన్ కమిటీ సభ్యులు రామారావు, జిల్లా స్టాఫ్ రిపోర్టర్ రవి కిరణ్ రెడ్డి, డబ్ల్యూడబ్ల్యూజే ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 137 కి.మీ. దూరమా... ఇదేనా ప్రజా పాలన!

**- ఇచ్ఛాపురం ఫిట్నెస్ సెంటర్ తరలింపుతో 5000 వాహనాలకు కష్టాలు**



**ఇచ్ఛాపురం:** వెహికల్ ఫిట్నెస్ టెస్టింగ్ సెంటర్‌ను ఇచ్ఛాపురం నుండి 137 కి.మీ. దూరంలోని శ్రీకాకుళానికి తరలించడంతో నియోజకవర్గంలోని వేలాది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని "హ=జ్రూ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రెస్ నోట్ విడుదల చేశారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సుమారు 4000 నుండి 5000 వరకు ఆటోలు, ట్రాక్టర్లు, లారీలు, బస్సులు ఉన్నాయని తెలిపారు. గతంలో ఇచ్ఛాపురంలోనే వెహికల్ ఫిట్నెస్ టెస్టింగ్ సెంటర్ ఉండేదని, కానీ 12 నెలల క్రితం దానిని శ్రీకాకుళం ఖ×మీా ఆసుపత్రి సమీపానికి తరలించారని వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆటోలు 60 కి.మీ. రేడియస్ లోపే నడపాలన్న నిబంధన ఉండగా, టెస్టింగ్ కోసం మాత్రం 137 కి.మీ. దూరం వెళ్లాల్సి వస్తుండటం విడ్డూరంగా ఉంని అన్నారు.ఒక ఆటో రోజుకు 500 నుండి 700 రూపాయల ఆదాయం వస్తుందని, ఇప్పటికే పెరిగిన ఆయిల్ ధరలతో ఖర్చులు అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితిలో టెస్టింగ్ పేరుతో శ్రీకాకుళం వెళ్లడం వల్ల రోజు కూలీతో పాటు ఇంధన ఖర్చు కూడా తడిసి మోపెడవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్ ఏజెన్సీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫిట్నెస్ సెంటర్‌లో పారదర్శకత లోపించిందని, పైరవీలు లేకుండా పనులు జరుగుతున్నాయా అనే అనుమానాలు ఉన్నాయని ప్రశ్నించారు. టెస్టింగ్ కోసం వెళ్లేటప్పుడు మార్గమధ్యంలో ప్రమాదం జరిగితే ఇన్సూరెన్స్ వర్తిస్తుందా అనే సందేహాలు కూడా వాహనదారుల్లో ఉన్నాయని తెలిపారు.నిబంధనలకు విరుద్ధంగా సెంటర్‌ను ఎందుకు తరలించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వాహన యజమానులు మరియు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు వచ్చే ఆదివారం 19-7-2026 ఉదయం 10 గంటలకు ఇచ్ఛాపురం బస్టాండ్ వద్ద "ఫ్యాక్ట్ చెక్ అండ్ మీట్ ది ప్రెస్" కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. రెవెన్యూ డివిజన్ పరిధిలో వెంటనే కొత్త ఫిట్నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

# జర్నలిస్టుల సంక్షేమానికి పనిచేసే ఏకైక యూనియన్

**- హెల్త్ కార్డులు.. అక్రిడేషన్ ల విషయంలో త్వరలోనే ఉద్యమ కార్యాచరణ**
**- టీయూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్**
**- టీడబ్ల్యూ జె హెచ్ 143 అడహాక్ కమిటీ కన్వీనర్గా వి. శివ కుమార్ ..కో కన్వీనర్ గా చింతకాయల వెంకటేష్..**

**హైదరాబాద్, :** జర్నలిస్టు సంక్షేమానికి ముందు నుంచి పోరాటం చేస్తున్న ఏకైక యూనియన్ టియుడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ అని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ అన్నారు. శుక్రవారం మహబూబ్నగర్లోని ప్రెస్ క్లబ్ భవనంలో ఏర్పాటుచేసిన సంఘం ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంఘం బలోపేతనంగా ఉందని అధికార పార్టీకి అనుబంధంగా ఉన్న యూనియన్ రెండున్నరేళ్ళ కాలంలో జర్నలిస్టుల సంక్షేమానికి చేసింది ఏమి లేదని విమర్శించారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు అమలు కావడం లేదన్న ఫిర్యాదులు ఉన్నాయని అ క్రడిటేషన్ కార్డుల విషయంలోనూ గందరగోళ పరిస్థితులు నెలకొని ఉన్నాయని వీటిపై త్వరలోనే యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ నిర్వహించనున్నామని హెచ్చరించారు. జిల్లాలో పెద్ద ఎత్తున సభ్యత నమోదు కార్యక్రమాన్ని నిర్వహించాలని నెల రోజుల్లో సభ్యత కార్యక్రమాలను పూర్తి చేసి తర్వాత మహాసభలు నిర్వహించి జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. అన్ని మండలాల్లో కూడా కమిటీలను నియమించడం జరుగుతుందని భవిష్యత్తు మళ్ళీ టీయూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ దే ఉంటుందని చేశారు. డెస్క్ జర్నలిస్టులకు కూడా పూర్తిగా అండగా ఉండి వారి సంక్షేమం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా సభ్యత నమోదు కార్యక్రమాలను ప్రారంభించారు. వివిధ యూనియన్లకు చెందిన జర్నలిస్టులు పెద్ద ఎత్తున టీయూడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ సభ్యత్వాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అడా కమిటీని నియమించారు. అడహక్ కమిటీ జిల్లా కన్వీనర్ గా వి శివకుమార్ కోకన్వీనర్ గా చింతకాయల వెంకటేష్ లను రాష్ట్ర కమిటీ నియమించింది. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కోశాధికారి యోగానంద్,జాతీయ కౌన్సిల్ సభ్యులు భాస్కర్, తిరుపతి నాయక్, జిల్లా జర్నలిస్టులు పి రవికుమార్, నరేంద్ర చారి, నరేందర్ గౌడ్, శివకుమార్, మధుసూదన్ రావు, తేజ వెంకట్, సతీష్ కుమార్, జీ రవి కుమార్, గోపి, కిరణ్ సాయికుమార్, శ్రీనివాస్, కృష్ణ అంజి, శేఖర్ గౌడ్, వెంకటేష్ గౌడ్ సుదీప్ రెడ్డి, లక్ష్మణ్, జక్కగోపాల్ తదితరులు పాల్గొన్నారు







# కే.పీ.హెచ్.బీ ఎస్‌హెచ్‌ఓగా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**-శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి...**




**కూకట్ పల్లి -** సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని కె.పి.హె.చ్.బి పోలీస్ స్టేషన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా జి.విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇటీవల సైబరాబాద్ కమిషనర్ జారీ చేసిన 55 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల మేరకు సైబర్ క్రైమ్స్ లో పనిచేసిన ఆయనను కెపిహెచ్బికు బదిలీ చేశారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీసు అధికారులతో సమావేశమైన విజయ్ కుమార్,ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తానని తెలిపారు. ఫిర్యాదులను వేగంగా పరిష్కరించడంతో పాటు చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడం తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ప్రజలు పోలీసులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను నిర్భయంగా తెలియజేయాలని కోరారు.వివిధ కీలక పోలీస్ స్టేషన్లలో సేవలందించిన అనుభవం కలిగిన విజయ్ కుమార్ బాధ్యతలు చేపట్టడంతో పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు.

# ఆపదలో ఉన్న వారికి సీఎంఆర్ఎఫ్ భరోసా: రూ. 2.50 లక్షల ఎల్ఓసిని పంపిణీ చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, జూలై 17**



ఆపద సమయంలో మెరుగైన వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు కొండంత అండగా నిలుస్తోందని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం పటాన్‌చెరులో జరిగిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ఎల్ఓసి పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు నాణ్యమైన వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయాన్ని పారదర్శకంగా అందిస్తుందని తెలిపారు.బాధిత కుటుంబానికి సాయం:అమీన్‌పూర్ డివిజన్‌కు చెందిన కూరపాటి రేణుక గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెరుగైన చికిత్స కోసం ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిని సంప్రదించి, సీఎంఆర్ఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం రూ. 2.50 లక్షల విలువైన ఎల్ఓసిని మంజూరు చేసింది. ఈ పత్రాలను రేణుక కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ సాయం నిరంతరం అందుబాటులో ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నర్సింగ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆషాఢ మాస వేడుకల్లో ముత్యాలమ్మ తల్లికి పసుపు కొమ్ములతో విశేష అలంకరణ





**ఖమ్మం భద్రాద్రి జిల్లా** అశ్వారావుపేట మండలం, ఊట్లపల్లి: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని ఊట్లపల్లి గ్రామ దేవత మాతృశ్రీ ముత్యాలమ్మ తల్లికి నాలుగు శుక్రవారాల పాటు ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి శుక్రవారం అమ్మవారిని పసుపు కొమ్ములతో అత్యంత వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మిగిలిన మూడు శుక్రవారాల్లో వరుసగా పూలతో, పండ్లతో, గాజులతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వహణలో ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి రాంబాబు కీలక పాత్ర పోషించారు.

## ముత్యాలమ్మ తల్లికి పసుపు కొమ్ములతో విశేష అలంకరణ

**అశ్వారావుపేట,** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం ఊట్లపల్లి గ్రామ దేవత మాతృశ్రీ ముత్యాలమ్మ తల్లికి ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని నాలుగు శుక్రవారాల పాటు ప్రత్యేక అలంకరణలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తొలి శుక్రవారం అమ్మవారిని పసుపు కొమ్ములతో అత్యంత వైభవంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు

ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో మిగిలిన మూడు శుక్రవారాల్లో వరుసగా పూలతో, పండ్లతో, గాజులతో అమ్మవారిని అలంకరించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా మహిళా భక్తులు, గ్రామ పెద్దలు, యువకులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు దాసరి రాంబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగింది.

# మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్ అమలుకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలి

**మెదక్,జూలై,17**



మెదక్ పట్టణ అభివృద్ధికి అత్యంత కీలకమైన నూతన మాస్టర్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలని మెదక్ పట్టణ టీఆర్ఎస్ కన్వీనర్, 5వ వార్డు కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు దాదాపు 40 సంవత్సరాల క్రితం రూపొందించిన పాత మాస్టర్ ప్లాన్‌ల స్థానంలో నూతన మాస్టర్ ప్లాన్‌లు రూపొందించే ప్రక్రియలో భాగంగా, గత పాలకవర్గం మెదక్ పట్టణానికి సంబంధించిన సమగ్ర సర్వేలను పూర్తి చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులు, ఎన్నికల కోడ్ అమలులో ఉండటం వల్ల ఆ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినా, నూతన మాస్టర్ ప్లాన్ అమలుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడం వల్ల మెదక్ పట్టణ అభివృద్ధి తీవ్రంగా దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్ లేకపోవడంతో కొత్త భవనాలకు నిర్మాణ అనుమతులు జారీ కావడం లేదని, దీంతో ప్రజలు అక్రమ నిర్మాణాల వైపు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ఫలితంగా మున్సిపాలిటీకి రావాల్సిన నిర్మాణ అనుమతి ఫీజులు, ఆస్తి పన్నులు వంటి ఆదాయం కోల్పోయి ఆర్థికంగా నష్టపోతోందని పేర్కొన్నారు.ఇప్పటికే మాస్టర్ ప్లాన్ పరిధిలో నిర్మించిన భవనాలకు బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ ( బీఆర్ఎస్) ద్వారా పూర్తి స్థాయి అనుమతులు కల్పించాలని, అలాగే మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌ను వెంటనే ఆమోదించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని జిల్లా కలెక్టర్‌తో సమన్వయం చేసి మెదక్ పట్టణ నూతన మాస్టర్ ప్లాన్‌కు త్వరితగతిన ఆమోదం వచ్చేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మెదక్ పట్టణ భవిష్యత్ అభివృద్ధి దృష్ట్యా జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.మామిళ్ల ఆంజనేయులుమెదక్ పట్టణ బిఆర్ఎస్ కన్వీనర్5వ వార్డు కౌన్సిలర్

# రోహిత్ ఖాతాలో అన్‌బిలీవబుల్ వరల్డ్ రికార్డులు




ఇప్పటికే టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ.. కేవలం 2027 వన్డే వరల్డ్ కప్ కోసమే బరిలోకి దిగుతున్నాడు. అయితే తాజాగా ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ లేడని బీసీసీఐ తేల్చి చెప్పినట్లు సమాచారం. ఇంగ్లాండ్ తో జరిగే మూడో వన్డే తర్వాత తను క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించ వచ్చనే ఊహగానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతని అద్భుత రికార్డుల గురించి తెలుసుకుందాం. ఇండియా క్రికెట్ టీమ్ స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లిమిటెడ్ ఓవర్ల ఫార్మాట్ లో ప్రపంచంలోనే మోస్ట్ డేంజరస్ బ్యాటర్ గా సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. వన్డే ఇంటర్నేషనల్స్ హిస్టరీలోనే ఒకే ఒక్క మ్యాచ్ లో 264 రన్స్ సంచలన స్కోర్ కొట్టి హైయెస్ట్ ఇండివిడ్యువల్ స్కోరర్ గా అగ్రస్థానంలో నిలిచాడు. వరల్డ్ వైడ్ గా వన్డే ఫార్మాట్ లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక ఏకైక క్రికెటర్ గా రోహిత్ నిలిచాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ లోని అన్ని ఫార్మాట్లు కలుపుకుని ఏకంగా 600 కి పైగా సిక్సర్లు బాది గ్లోబల్ సిక్స్-హిట్ లీడర్ గా సరికొత్త రికార్డ్ నెలకొల్పాడు. 2019 ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్ కప్ లో ఒకే ఎడిషన్ లో ఐదు సెంచరీలు కొట్టిన ఫస్ట్ మేల్ క్రికెటర్ గా హిస్టరీ క్రియేట్ చేయడంతో పాటు, కెప్టెన్ గా ఇండియాకు 2024 టీ20 వరల్డ్ కప్ టైటిల్, 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని అందించి రెండు ఐసీసీ టైటిళ్లు అందించిన లీడర్ గా ధోనీ తర్వాత స్థానంలో ఉన్నాడు. వన్డే, టీ20 ఫార్మాట్లలో రోహిత్ శర్మ సాధించిన అఫీషియల్ కెరీర్ రికార్డుల కంప్లీట్ డేటా చూస్తే, స్టులు 67 టెస్టులలో 4,300కిపైగా పరుగులతో పాటు 12 సెంచరీలు చేశాడు. అలాగే 287 వన్డేలలో 11,730 పరుగులు, 33 సెంచరీలు నమోదు చేశాడు. 159 టీ20లలో 4,231 పరుగులు చేయగా, అందులో 5 సెంచరలు ఉన్నాయి. రోహిత్ శర్మ వన్డే క్రికెట్ లో చూపించిన ఇంపాక్ట్, అతని సాలిడ్ రన్ రేట్ ఇంటర్నేషనల్ క్రికెట్ లోనే లెజెండరీగా నిలిచాయని క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రెజెంట్ వన్డేలలో రోహిత్ శర్మ మోస్ట్ డిస్ట్రక్టివ్ ప్లేయర్లలో ఒకరు. అలాగే కెప్టెన్ గా కూడా వన్డే ప్రపంచకప్ ఫైనల్ కు 2011 తర్వాత రోహితే చేర్చడం విశేషం. సొంతగడ్డపై 2023లో జరిగిన ఎడిషన్ లో ఇండియా రన్నరప్ గా నిలిచింది. వన్డే, టీ20 ఫార్మాట్లలో రోహిత్ శర్మ సాధించిన అఫీషియల్ కెరీర్ రికార్డుల కంప్లీట్ డేటా చూస్తే, స్టులు 67 టెస్టులలో 4,300కిపైగా పరుగులతో పాటు 12 సెంచరీలు చేశాడు. అలాగే 287 వన్డేలలో 11,730 పరుగులు, 33 సెంచరీలు నమోదు చేశాడు. 159 టీ20లలో 4,231 పరుగులు చేయగా, అందులో 5 సెంచరలు ఉన్నాయి. రోహిత్ శర్మ వన్డే క్రికెట్ లో చూపించిన ఇంపాక్ట్, అతని సాలిడ్ రన్ రేట్ ఇంటర్నేషనల్ క్రికెట్ లోనే లెజెండరీగా నిలిచాయని క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రెజెంట్ వన్డేలలో రోహిత్ శర్మ మోస్ట్ డిస్ట్రక్టివ్ ప్లేయర్లలో ఒకరు. అలాగే కెప్టెన్ గా కూడా వన్డే ప్రపంచకప్ ఫైనల్ కు 2011 తర్వాత రోహితే చేర్చడం విశేషం. సొంతగడ్డపై 2023లో జరిగిన ఎడిషన్ లో ఇండియా రన్నరప్‌గా నిలిచింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీలోనూ రోహిత్ శర్మ ఒక సంచలన రికార్డ్ క్రియేట్ చేశాడు. ఐపీఎల్ లో మొత్తం సిక్స్ టైమ్స్ టైటిల్ విన్నర్ గా నిలిచాడు. ఫస్ట్ 2009 లో డెక్కన్ చార్జర్స్ టీమ్ లో ప్లేయర్ గా టైటిల్ గెలవగా, ఆ తర్వాత ముంబై ఇండియన్స్ కు కెప్టెన్ గా మారి ఏకంగా ఐదు అద్భుతమైన ఐపీఎల్ ట్రోఫీలను (2013, 2015, 2017, 2019, 2020) అందించి లీగ్ హిస్టరీలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్ గా నిలిచాడు. ముంబై ఇండియన్స్ ను లీగ్ లోనే ఒక మోస్ట్ రెస్పెక్టెడ్ టీమ్ గా బిల్డ్ చేయడంలో రోహిత్ కీ రోల్ ప్లే చేశాడు. ఐపీఎల్లో కేవలం కెప్టెన్సీ లోనే కాకుండా బ్యాటింగ్ లోనూ రోహిత్ శర్మ ఒక ఎలైట్ రన్ స్కోరర్ గా నిలిచాడు. లీగ్ లో ఏకంగా 6,000 కంటే ఎక్కువ రన్స్ స్కోర్ చేయడంతో పాటు మల్టిపుల్ సెంచరీలు, హాఫ్ సెంచరీలు బాదాడు. లీగ్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఇండియన్ ప్లేయర్ గా రోహిత్ పేరిట ఒక క్రేజీ రికార్డ్ ఉంది. ఈ సాలిడ్ పర్ఫార్మెన్స్ ల వల్లే ఐపీఎల్ హిస్టరీలోనే ఒక అల్-టైమ్ గ్రేట్ స్టాల్వర్ట్ గా రోహిత్ శర్మ నిలిచాడు. ఏదేమైనా రిటైర్మెంట్ గురించి రోహిత్ నుంచి స్పష్టత రాకపోయినా, మూడో వన్డే తర్వాత ఈ విషయంపై క్లారిటీ వచ్చే అవకాశముంది. మరోవైపు రిటైర్మెంట్ వార్తతో హిట్ మ్యాన్ అభిమానులు ఉలిక్కి పడుతున్నారు. సోషల్ మీడియాలో రోహిత్ గురించి పోస్టులు పెడుతున్నారు. తన ఘనతల గురించి, ట్రేడ్ మార్క్ పుల్ షాట్ గురించి మాట్లాడుతున్నారు.

# రికార్డు క్రియేట్ చేసిన జో రూట్..!



భారత్‌తో జరిగిన రెండో వన్డేలో, ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అరుదైన రికార్డు సాధించాడు. వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌గా అతడు చరిత్ర సృష్టించాడు. కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రూట్ అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. ఛేజింగ్‌లో జట్టును ముందుండి నడిపించాడు. భారత్ నిర్దేశించిన 234 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అతడు 99 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. తన 17న వన్డే సెంచరీకి కేవలం ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. ఈ ఉత్కంఠభరితమైన ముగింపుతో, ఈ సీనియర్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ మొత్తం వన్డే చరిత్రలో 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన 17వ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. గతంలో అలెన్ లాంబ్, అలెక్స్ హేల్స్, జోస్ బట్లర్ వంటి పలువురు ఇంగ్లాండ్ ఆటగాళు 50 ఓవర్ల ఫార్మాట్‌లో 99 పరుగుల వద్ద ఔట్ అయ్యారు. అయితే సక్సెస్‌ఫుల్ ఛేజింగ్‌లో చివరి వరకూ క్రీజులో ఉండి.. సెంచరీకి కేవలం ఒక పరుగు దూరంలో నిలిచిన తొలి ఇంగ్లీష్ ఆటగాడు రూట్ మాత్రమే కావడం గమనార్హం. ఇంగ్లాండ్ ఛేజింగ్ చివరి దశలో ఈ ఘనత నమోదైంది. నిజానికి రూట్ ఈజీగా సెంచరీ చేసేలా కనిపించాడు. 234 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 42 ఓవర్లు ముగిసే సరికి 214/6తో నిలిచింది. ఆ సమయంలో రూట్.. 130 బంతుల్లో 97 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 20 రన్స్ అవసరం. కానీ గస్ అట్కిన్సన్.. రూట్‌కు సెంచరీని దూరం చేశాడు. 16 బంతుల్లో 23 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో రూట్ ఆట చివరకు.. 133 బంతుల్లో 99 పరుగులు చేసి నాటౌట్‌గా మిగిలిపోయాడు. సెంచరీ మిస్ అయినా.. రూట్ ఇంగ్లాండ్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమైన ఇదే పిచ్‌పై నిలకడగా రాణించి.. సిరీస్‌ను ఇంగ్లాండ్ 1-1తో సమం చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

# అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డు సృష్టించిన కోహ్లీ

భారత క్రికెట్ దిగ్గజం, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ ద్వారా కోహ్లీ తన కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని దాటాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బద్దలు కొట్టాడు. 561వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన కోహ్లీ.. 560 మ్యాచ్‌లు ఆడిన రికీ పాంటింగ్‌ను అధిగమించి ఈ ఎలైట్ లిస్టులో ఐదో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. కోహ్లీ తన అంతర్జాతీయ కెరీర్‌ను 2008లో ప్రారంభించాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఫార్మాట్ ఏదైనా తనదైన బ్యాటింగ్‌తో జట్టుకు ఎన్నో అపురూప విజయాలు అందించిన కోహ్లీ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో చారిత్రాత్మక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పుడు ఏకంగా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన లెజెండరీ ఆటగాళ్ల సరసన నిలిచి తన స్థాయి ఏంటో మరోసారి ప్రపంచానికి నిరూపించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్ 664 మ్యాచులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతడి తర్వాత శ్రీలంక మాజీ ఆటగాళ్లు మహేల జయవర్ధనే 652 మ్యాచులతో రెండో స్థానంలో, కుమార సంగక్కర 594 మ్యాచులతో మూడో స్థానంలో, సనత్ జయసూర్య 586 మ్యాచులతో నాలుగో స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న కోహ్లీ.. యాక్టివ్ క్రికెటర్లలో అందరికంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 538 మ్యాచులతో ఈ జాబితాలో ఏడో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ వయసు, ఫామ్‌తో సంబంధం లేకుండా నిరంతరం కష్టపడుతూ ఫిట్‌నెస్ విషయంలో యువ ఆటగాళ్లకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ ద్వారా రీఎంట్రీ ఇచ్చిన అతడు.. గురువారం జరిగిన రెండో వన్డేలో హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు.



# చరిత్ర సృష్టించిన కీరన్ పొలార్డ్!



వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం కీరన్ పొలార్డ్ చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో 1000 సిక్సర్లను పూర్తి చేసుకున్నాడు. తద్వారా ప్రపంచంలోనే ఈ ఘనతను అందుకున్న రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అగ్రరాజ్యం అమెరికా వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో ముంబై న్యూయార్క్‌కు సారథ్యం వహిస్తున్న పొలార్డ్.. వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన ఎలిమినేటర్-1 మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన పొలార్డ్.. 25 బంతుల్లోనే 250కి పైగా స్ట్రైక్‌రేట్‌తో 64 పరుగులు చేశాడు. ఇందులో 8 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు 1000 సిక్సర్ల మైలురాయికి 7 సిక్సర్ల దూరంలో ఉన్న పొలార్డ్.. ఈ మ్యాచ్‌లో 8 బాది ఈ అరుదైన ఫీట్ సాధించాడు. 39 ఏళ్ల ఏళ్ల వయసులో పొలార్డ్ ఈ ఫీట్ సాధించాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డ్ వెస్టిండీస్‌కే చెందిన యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పేరిట ఉంది. అతను 463 మ్యాచ్‌ల్లో 1056 సిక్సర్లు కొట్టాడు. 745 మ్యాచ్‌లు ఆడిన పొలార్డ్.. గేల్ రికార్డ్‌ను అధిగమించడానికి ఇంకా 56 సిక్సర్లు కావాలి. ఈ జాబితాలో వెస్టిండీస్‌కే చెందిన ఆండ్రీ రస్సెల్ 792 సిక్సర్లతో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్ కీరన్ పొలార్డ్ రాణించినా ముంబై న్యూయార్క్‌కు ఓటమి తప్పలేదు. ఆండ్రీస్ గౌస్ అద్భుత శతకంతో వాషింగ్టన్ ఫ్రీడమ్ 6 వికెట్ల తేడాతో ముంబై న్యూయార్క్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ నిర్ణీత 20 ఓవర్లలో 267 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. నికోలస్ పూరన్(33 బంతుల్లో 5 ఫోర్లు, 13 సిక్స్‌లతో 106) సెంచరీతో చెలరేగగా.. కీరన్ పోలార్డ్(25 బంతుల్లో ఫోర్, 8 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీతో రాణించాడు. అనంతరం వాషింగ్టన్ ఫ్రీడమ్ 18.4 ఓవర్లలో 270 పరుగులు చేసి రికార్డ్ విజయాన్ని అందుకుంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్(110లి), ఆండ్రిస్ గోస్(132) శతకాలతో చెలరేగాడు. టీ20 క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఛేజింగ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది.

# తొలిసారి జపాన్ ఓపెన్ సెమీస్‌కు పీవీ సింధు



**హైదరాబాద్ :** తన సుదీర్ఘ కెరీర్‌లో తొలిసారిగా భారత స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రత్యర్థి నొజుమి ఒకుహర వైదొలగడంతో సింధుకు వాకోవర్ లభించింది. రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధు, జపాన్ ఓపెన్‌లో ఇదే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. సెమీఫైనల్స్‌లో ఆమె ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫైతో తలపడనుంది. 15 ఏళ్ల తర్వాత భారత మహిళా షట్లర్ ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరడం విశేషం. గతంలో సైనా నెహ్వాల్ 2011లో సెమీస్‌కు చేరి ఓటమిపాలైంది.

శనివారం,
జూలై 18, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్.. బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు



టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను విడుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు" అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నలుగురు హీరోయిన్లు?

## రాఘవ లారెన్స్ 30వ సినిమాపై ఆసక్తికర ప్రచారం

## లారెన్స్ సరసన సాయి పల్లవి, జాన్వీ, రుక్మిణి, కయాదు

## ఇది లారెన్స్ సొంత నిర్మాణ సంస్థలో రానున్న చిత్రం

## నూతన దర్శకుడు తిరుపుగల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్న వైనం




నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 30వ సినిమాకు సిద్ధమవుతున్నారు. 'ఆ-30' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అయితే, సినిమా ప్రారంభం కాకముందే దీని క్యాస్టింగ్ సంచలనంగా మారింది. ఈ చిత్రంలో ఒకరు కాదు, ఏకంగా నలుగురు ప్రముఖ హీరోయిన్లు నటించనున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ భారీ చిత్రంలో సాయి పల్లవి, జాన్వీ కపూర్, రుక్మిణి వసంత్, కయాదు లోహర్ కీలక పాత్రలు పోషించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నలుగురు నటీమణులకు ఉన్న క్రేజ్ దృష్ట్యా సౌత్ ఇండియన్ సినిమాలో ఇది చర్చనీయాంశం అయింది. దాంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి.

ఈ చిత్రాన్ని రాఘవ లారెన్స్ తన సొంత నిర్మాణ సంస్థ 'రాఘవేంద్ర ప్రొడక్షన్స్' బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. తిరుపుగల్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై హీరోయిన్ల వార్తలతో ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపైంది.

# ఉప ఎన్నికలకు సిద్ధం

## టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం..




టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఙఖీఐఇూ) కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించింది. ఫెడరేషన్ జోక్యాన్ని ఖండిస్తూ లేఖ విడుదల చేసిన అసోసియేషన్, ఖాళీ అయిన పోస్టులకు ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ సభ్యుల డిమాండ్ మేరకు ఉప ఎన్నికలకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియను జులై 20న నామినేషన్లు దాఖలు స్వీకరించడంతో ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఎన్నికల అధికారి అదే రోజు నుంచి నామినేషన్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపింది. జులై 22 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

ఎన్నికల నిబంధనల ప్రకారమే ఈ ఎలక్షన్స్ జరుగుతాయని అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్‌లో ఇటీవల జరిగిన వివాదం నేపథ్యంలో 10 మంది సభ్యులను సస్పెండ్ చేశారు. మిగిలిన ఆరుగురు కూడా ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు అసోసియేషన్ స్పష్టం చేసింది.

# సరికొత్త సామాజిక క్యాంపెయిన్.. రకుల్, సమంతలకు కాజల్ సవాల్!

ఆహార కల్తీ, ప్రజలపై పడుతున్న దుష్ప్రభావాలపై క్యాంపెయిన్ మనం తినే ఆహారం నిజంగానే సురక్షితమా అని ప్రశ్న టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు.

ఈ క్రమంలో, కాజల్ #WhatsOnYourPlateµ (మీ ప్లేట్ లో ఏముంది) అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలను కూడా పాల్గొనమని సవాల్ విసిరింది.

నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు.

ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్‌ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా



# సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి '3 ఇడియట్స్' హీరో పాత్రను రూపొందించలేదు: ఆమిర్ ఖాన్



బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం '3 ఇడియట్స్'లోని ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాత్రను అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ పోషించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ పాత్రకు లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్ఫూర్తి అని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమిర్ ఖాన్ స్వయంగా స్పందించారు. ఆ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు, ఆ పాత్రకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమిర్ మాట్లాడారు. '3 ఇడియట్స్' కథా చర్చల సమయంలో తమకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా కూడా ఆయన్ను ఎప్పుడూ కలవలేదని చెప్పారు. అందుకే ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రను ఆయన జీవితం ఆధారంగా రూపొందించలేదని స్పష్టం చేశారు. ఈ సినిమాలో 'చతుర్' పాత్ర పోషించిన ఓమీ వైద్య విడుదల చేసిన ఒక వీడియోపై కూడా ఆమిర్ స్పందించారు. ఫున్‌సుఖ్ పాత్ర సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి రూపొందించారని ఓమి చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ఆ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. అయితే, సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న సామాజిక సేవలను తాను ఎంతగానో గౌరవిస్తానని ఆమిర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన చేస్తోన్న నిరవధిక నిరాహార దీక్ష గురించి ప్రస్తావిస్తూ.. సోనమ్ ఆరోగ్యం క్షీణిస్తోందని, దీక్ష విరమించాలని పలువురు కోరుతున్నారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను గౌరవించడానికి '3 ఇడియట్స్' పాత్రతో ముడిపెట్టాల్సిన అవసరం లేదని, ఆయన చేస్తోన్న కృషి అసామాన్యమైనదని ఆమిర్ కొనియాడారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్ గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వెంటనే దీక్ష విరమించాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# ఓటీటీలోకి వచ్చేసిన 'మా ఇంటి బంగారం'..



స్టార్ హీరోయిన్ సమంత సుమారు మూడేళ్ల విరామం తర్వాత 'మా ఇంటి బంగారం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. థియేటర్లలో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు ఓటీటీ వేదికపైకి వచ్చేసింది. హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి తెలుగు సినిమాగా చరిత్ర సృష్టించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ఇప్పుడు డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చింది. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ 'జియో హాట్‌స్టార్' దక్కించుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేశారు. దీంతో దక్షిణాది సినీ ప్రియులు ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళలను ఎంతగానో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోనూ అదే ఆదరణ పొందుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com